


సీఐటీయూ నాయకుడు సీహెచ్ నరసింగరావును అరెస్టు చేస్తున్న పోలీసులు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



విశాఖపట్నం

జిల్లా వార్తలు

బుధవారం 11 సెప్టెంబరు 2024



కూర్మన్నపాలెం వద్ద రాస్తారోకోలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు

రోడ్డెక్కిన ఉక్కు కార్మికులు

కూర్మన్నపాలెం జంక్షన్‌లో రాస్తారోకో

- స్టీలుప్లాంటును పూర్తిస్థాయి సామర్థ్యంతో నడపాలి
- నిర్వహణ మూలధనం సమకూర్చాలి
- సెయిల్‌లో విలీనం చేయాలి
- ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్టు కేంద్రం తక్షణం ప్రకటన చేయాలని డిమాండ్
- జాతీయ రహదారిపై కిలోమీటర్లు మేర నిలిచిపోయిన వాహనాలు
- కార్మిక సంఘాల నేతలు అరెస్టు... స్టీల్‌ప్లాంటు పోలీస్ స్టేషన్‌కు తరలింపు

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 10: ఉక్కు కార్మికులు పిడికిలి బిగించారు. కర్మాగారాన్ని పూర్తిస్థాయి సామర్థ్యంతో నడపాలని, సొంత గనులు కేటాయించడంతో పాటు నిర్వహణ మూలధనం సమకూర్చాలని, సెయిల్‌లో విలీనం చేస్తూ, ప్రభుత్వ రంగ పరిశ్రమగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కూర్మన్నపాలెం జంక్షన్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 10.30 నుంచి 12 గంటల వరకూ జరిగిన ఈ ఆందోళన కార్యక్రమంలో వందలాది మంది కార్మికులు, ఉద్యోగులు, నిర్వాసితులు పాల్గొన్నారు. ప్లకార్డులు, బ్యానర్లు చేత పట్టుకొని పెద్దఎత్తున నినాదాలు చేస్తూ రహదారిపై బైఠాయించారు. దీంతో జాతీయ రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు రంగప్రవేశం చేసినా కార్మికులు వెనక్కి తగ్గలేదు. దీంతో కార్మిక సంఘ నాయకులను ఏసీపీ టి.త్రినాథ్ ఆధ్వర్యంలో అరెస్టు చేసి స్టీల్‌ప్లాంటు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకొంది. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు సీహెచ్ నరసింగరావు, డి.ఆదినారాయణ మాట్లాడుతూ ఉద్యమాలను ... మిగతా 6వ పేజీలో



రాస్తారోకోతో భారీగా నిలిచిపోయిన వాహనాలు

ఇంకా పుంజుకోని రిజిస్ట్రేషన్లు



- ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఎన్నికల ప్రభావం
- ఇప్పుడు వర్షాలతో వెనకడుగు
- ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకూ చూస్తే లక్ష్యంలో 55.33 శాతం ఆదాయం మాత్రమే సాధన

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రిజిస్ట్రేషన్ల శాఖకు ఆదాయం ఆశించినంతగా రావడం లేదు. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) ప్రారంభం నుంచే ప్రతికూల వాతావరణం నెలకొంది. ఏప్రిల్ మొదలుకొని ఆగస్టు వరకూ ప్రతి నెలా 50 నుంచి 55 శాతం లక్ష్యం మాత్రమే సాధిస్తున్నారు.

సాధారణ ఎన్నికలు ప్రకటనతో ఏప్రిల్ నుంచే నగదు లావాదేవీలు స్తంభించిపోయాయి. స్థిరాస్తుల కొనుగోళ్లకు ఎవరూ ముందుకు రాలేదు. అదొక్కటే కాకుండా విశాఖపట్నం జిల్లాకు మరో ప్రత్యేకత ఉంది. అప్పటి వైసీపీ ప్రభుత్వం విశాఖను పరిపాలనా రాజధానిగా ప్రకటించింది. ఎన్నికల్లో తాము గెలిస్తే విశాఖ రాజధానిగా ప్రజలు ఆమోదించినట్టేనని, ఇక్కడి నుంచే పరిపాలన చేస్తామని ప్రకటించింది. దాంతో ఎన్నికలు ముగిశాక ఫలితాలను బట్టి చూడవచ్చుననే అభిప్రాయంతో చాలామంది అప్పటికి స్థిరాస్తి కొనుగోళ్లకు వెనకడుగు వేశారు. దాంతో ఏప్రిల్, మే నెలల్లో లావాదేవీలు బాగా పడిపోయాయి. వైసీపీ ఓడిపోవడంతో విశాఖలో పరిపాలనా రాజధాని అనే వాదనకు తెర పడింది. కొత్తగా అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం అమరావతిని రాజధానిగా అభివృద్ధి చేయడానికి శరవేగంతో పనులు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో విశాఖలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోతుందని చాలా మంది భావించారు. కానీ 'సిటీ ఆఫ్ డెస్టినీ'గా గుర్తింపు పొందిన విశాఖలో ఆది నుంచి స్థలాలు, అపార్టుమెంటు ప్లాట్లకు మంచి డిమాండ్ ఉంది. హైదరాబాద్‌తో పోటీపడే ధరలు ఇక్కడ ఉన్నాయి.కాకపోతే వెంటనే రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకోలేదు.కొద్దికొద్దిగా రికవరీ అవుతోంది. ఇప్పుడు వర్షాలు, వరదలు రావడంతో ఆ ప్రభావం కూడా స్థిరాస్తి కొనుగోళ్లపై పడింది. అన్నీ సర్దుకున్నాక మార్కెట్ మెల్లగా పుంజుకుంటుందని ఆర్థిక సంవత్సరం ముగిసేసరికి 70 నుంచి 80 శాతం లక్ష్యం సాధించగలుగుతామని ఆ శాఖ అధికారులు విశ్వాసం వ్యక్తంచేస్తున్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఆదాయం వివరాలు

కార్యాలయం	లక్ష్యం	సాధించినది
ఆనందపురం	రూ.44.93 కోట్లు	రూ.22.78 కోట్లు
భీమునిపట్నం	రూ.42.56 కోట్లు	రూ.22.48 కోట్లు
ద్వారకానగర్	రూ.82.17 కోట్లు	రూ.42.73 కోట్లు
గాజువాక	రూ.74.45 కోట్లు	రూ.51.81 కోట్లు
గోపాలపట్నం	రూ.46.38 కోట్లు	రూ.20.57 కోటు
మధురవాడ	రూ.166.15 కోట్లు	రూ.97.77 కోట్లు
పెందుర్తి	రూ.57.82 కోట్లు	రూ.30.66 కోట్లు
సూపర్‌బజార్	రూ.189.79 కోట్లు	రూ.98.48 కోట్లు
పెదగంట్యాడ	రూ. 62.09 కోటు	రూ.34.76 కోట్లు
మొత్తం	రూ.766.34 కోట్లు	రూ.424.04 కోట్లు

55.33 శాతమే లక్ష్య సాధన

విశాఖపట్నం జిల్లాలో గల తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కలిపి ఏప్రిల్ నుంచి ఆగస్టు నెల వరకు రూ.766.34 కోట్లు ఆదాయం సాధించాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. అంతా కలిసి 55.33 శాతం అంటే 424.04 కోట్ల ఆదాయం సాధించారు. ఇందులో గాజువాక కార్యాలయం 69.59 శాతంతో అగ్రస్థానంలో ఉండగా, మధురవాడ కార్యాలయం 58.84 శాతంతో రెండో స్థానంలో నిలిచింది. గోపాలపట్నం కార్యాలయం కేవలం 44.36 శాతంతో ఆఖరి స్థానంలో ఉండిపోయింది.

కోలుకుంటామని విశ్వాసం ఉంది

- బాలకృష్ణ, డీఐజీ, విశాఖపట్నం

ఎన్నికల ఏడాది కావడంతో నగదు లావాదేవీలు నిలిచిపోయాయి. ఆ ప్రభావం రిజిస్ట్రేషన్లపై పడింది. మొదటి మూడు నెలలూ ఇదే సమస్య వల్ల అభివృద్ధి రేటు మైనస్‌లోకి వెళ్లిపోయింది. ఇప్పుడిప్పుడు పరిస్థితి చక్కబడుతోంది. మైనస్ నుంచి బయటపడి గత ఏడాది కంటే మెరుగైన వృద్ధి సాధిస్తామనే నమ్మకం ఉంది. లక్ష్యంలో 70 శాతం దాటితే బాగా జరిగినట్టే.

సీలేరు, భద్రాచలం బస్సులు రద్దు

- రహదారి మరమ్మతుల అనంతరమే సర్వీస్‌లు పునరుద్ధరణ
- పాడేరు, మాడుగుల సర్వీస్‌లు చోడవరం వరకే...

ద్వారకా బస్‌స్టేషన్, సెప్టెంబరు 10: విశాఖ నుంచి సీలేరు రాకపోకలు సాగించాల్సిన నాలుగు బస్సులు, భద్రాచలం రాకపోకలు సాగించాల్సిన నాలుగు బస్సులను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం ప్రకటించింది. ఈ నెల ఒకటో తేదీన కురిసిన వర్షాలకు రోడ్లు జలమయం కావడంతో రెండో తేదీ నుంచి ఈ సర్వీస్‌లను రద్దు చేశారు. రెండు రోజుల నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టడంతో బస్సులు నడిపేందుకు ఇంజనీరింగ్ అధికారులు రూట్ సర్వే నిర్వహించారు. అయితే అనేక చోట్ల గోతులు/గండ్లు పడి ఉండడంతో ఆ మార్గంలో బస్సులు నడపడం సాధ్యం కాదని ఇంజనీరింగ్ అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ ... మిగతా 6వ పేజీలో

అప్రమత్తంగా ఉండండి

ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే తక్షణం రక్షణ, సహాయక చర్యలు చేపట్టండి

ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర అధికారులకు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశం

విశాఖపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):

ప్రకృతి వైపరీత్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తక్షణ రక్షణ, సహాయక చర్యల్లో బాధ్యతగా వ్యవహరించాలని ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులను రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. వైపరీత్యాల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఇటీవల కురిసిన భారీవర్షాల వల్ల వాటిల్లిన నష్టం, తీసుకున్న సహాయ చర్యలపై విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతా రామరాజు, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో మంగళవారం ఉదయం విశాఖపట్నం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె సమీక్ష నిర్వహించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న హోం శాఖా మంత్రి అనిత, కలెక్టర్ హరేంధిర ప్రసాద్

- విశాఖ కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్
- జలాశయాల స్థితిగతులు ఎప్పటికప్పుడు తెలుసుకోండి
- గేట్ల పనితీరును నిశితంగా పరిశీలించండి
- ప్రతి గ్రామంలో ఐదుగురితో ఆపద మిత్ర బృందాలను ఏర్పాటుచేయండి
- వరద సహాయక చర్యలపై శిక్షణ ఇవ్వండి

ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ భారీవర్షాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, విజయవాడలో మాదిరిగా సహాయ రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో నీటి పారుదల శాఖ అధికారులతో జిల్లాలోని జలాశయాల స్థితిగతులపై కలెక్టర్లు సమీక్షిస్తుండాలని ఆదేశించారు. పనిచేయని, పాడైన రిజర్వాయర్ గేట్లకు మరమ్మతులు చేయించాలని సూచించారు. భారీవర్షాల సమయంలో పొరుగు రాష్ట్రాల నుంచి ముందస్తు సమాచారాన్ని సేకరించడం ద్వారా జిల్లాలో ముంపు, పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు ముందుగా తరలించేందుకు వీలుంటుందన్నారు. ప్రతికూల పరిస్థితుల్లో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా చూడడమే కాకుండా, సహాయ చర్యల్లో ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతోపాటు వారి బోట్లను కూడా వినియోగించు కునేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ఐదుగురు సభ్యులతో ఆపద మిత్ర బృందాలను ఏర్పాటుచేసి వారికి ప్రకృతి వైపరీత్యాలు సమయంలో తీసుకోవాల్సిన సహాయక చర్యలపై శిక్షణ ఇవ్వాలన్నారు. దీనివల్ల ముందస్తు రక్షణ చర్యలకు అవకాశం కలుగుతుందన్నారు. జిల్లా, మండల కేంద్రాల్లో శాశ్వత టోల్‌ఫ్రీ, ల్యాండ్ లైన్ నంబర్లను ఏర్పాటు చేయాలని, తద్వారా ప్రజలకు అవగాహన పెరుగుతుందన్నారు. విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర్ ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల ఏడు, ... మిగతా 6వ పేజీలో

89 చోరీ కేసుల్లో 80 మంది అరెస్టు

- నిందితుల నుంచి రూ.22.37 లక్షల విలువైన సొత్తు రికవరీ



రికవరీ చేసిన చోరీ సొత్తును పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆగస్టు నెలలో జరిగిన 89 చోరీ కేసులకు సంబంధించి 80 మంది నిందితులను అరెస్టు చేసినట్టు సీపీ శంఖబ్రత బాగ్చి తెలిపారు. ఈ కేసుల్లో స్వాధీనం చేసుకున్న సొత్తును బాధితులకు తిరిగి అందజేసేందుకు 'రికవరీ మేళా' పేరుతో పోలీస్ కమిషనరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల నగరంలో 112 చోరీ కేసులు నమోదయ్యాయన్నారు. వీటిలో 89 కేసులను నేర పరిశోధన విభాగం అధికారులు, సిబ్బంది ఛేదించారన్నారు. ఆయా నేరాలకు పాల్పడిన 80 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.22.37 లక్షల విలువైన ... మిగతా 6వ పేజీలో

వర్షాలకు దెబ్బతిన్న రహదారులు

పలుచోట్ల పెద్దపెద్ద గోతులు

- జాతీయ రహదారి పరిస్థితి మరింత దారుణం
- ప్రమాదాలకు గురవుతున్న వాహన చోదకులు
- మరమ్మతులకు రూ.12 కోట్లతో జీవీఎంసీ అధికారుల ప్రతిపాదన

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఇటీవల కురిసిన వర్షాలకు నగరంలో పలు రహదారులు పెద్ద పెద్ద గోతులతో దారుణంగా తయారయ్యాయి. దీంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో వాహన చోదకులను అప్రమత్తం చేసేందుకు భారీ గోతులు ఉన్నచోట స్థానికులు కొందరు కుర్చీలు, చెట్ల కొమ్మలను అడ్డుగా ఉంచుతున్నారు.

బంగాళాఖాతంలో వరుసగా ఏర్పడిన రెండు వాయుగుండాల ప్రభావంతో నగరంలో గత 15 రోజుల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. ఈనెల 6,7,8 తేదీల్లో అయితే ఎడతెరిపిలేకుండా భారీవర్షం పడింది. వర్షం నీటితో రోడ్లన్నీ చిన్నపాటి చెరువులను తలపించాయి. ఆ నీటిలో నుంచే భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో తారు, పిక్కలు లేచిపోయి గోతులు ఏర్పడ్డాయి. వాహనాల తాకిడికి కొన్నిచోట్ల గోతులు పెద్దవిగా మారిపోయాయి. జాతీయ రహదారిపై పరిస్థితి అయితే మరింత ... మిగతా 6వ పేజీలో



జాతీయరహదారిపై ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద గోతులు



ముస్లింతాటిచెట్లపాలెం వద్ద జాతీయ రహదారిపై...

ఆరోగ్య శాఖపై ఫిర్యాదుల వెల్లువ

- ఏఎన్ఎం, ఇతర పోస్టుల భర్తీలో అవకతవకలు
- విజిలెన్స్ అధికారులకు ఒక ఉద్యోగి ఫిర్యాదు
- ఆంధ్ర మెడికల్ కాలేజీ పరిధిలోనూ అక్రమాలు
- విచారణకు ఆదేశించిన డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్..?
- ప్రభుత్వ మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై సీఎంకు అందిన ఫిర్యాదు
- విజయవాడ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు విచారణ బాధ్యత?

విశాఖపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య, ఆరోగ్య శాఖతో పాటు పలు ఆస్పత్రుల్లో జరుగుతున్న వ్యవహారాలపై ఫిర్యాదులు అందడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. వివరాలు ఇలా ఉన్నాయి. పెదవాల్తేరులోని ప్రభుత్వ మానసిక వైద్యశాలలో సూపరింటెండెంట్ నిధులను దుర్వినియోగం చేయడంతోపాటు సిబ్బందిని వేధిస్తున్నారంటూ భాస్కర్ శతపతి అనే వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌కు కొద్దిరోజుల కిందట ఫిర్యాదు చేశారు. అర్హత లేని వ్యక్తిని డ్రైవర్‌గా నియమించుకున్నారని, గతంలో సీఎం జగన్ తనకు బంధువు అని చెప్పి ఉద్యోగులను భయాభ్రాంతులకు గురిచేయడంతోపాటు అడ్డగోలుగా నిధులను డ్రా చేశారంటూ సూపరింటెండెంట్‌పై సదరు వ్యక్తి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించినట్టు తెలిసింది. విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు విచారణ బాధ్యతలు అప్పగించినట్టు చెబుతున్నారు. అలాగే, 2019-2020 మధ్య జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సచివాలయ ఏఎన్ఎం పోస్టులను భర్తీచేశారు. ఈ పోస్టుల భర్తీలో అవినీతి జరిగిందంటూ ఆరోగ్య శాఖలో పనిచేసి పదవీ విరమణ చేసిన ఉద్యోగి ఒకరు విజిలెన్స్ ... మిగతా 6వ పేజీలో

సీఐల బదిలీ - వార్త 6లో



కిరణ్మయికి ప్రశంసాపత్రం అందిస్తున్న ప్రిన్సిపాల్

కాంస్య పతక విజేతకు అభినందన

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 10: జీవిత బీమా సంస్థ 68వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన అంతర కళాశాలల వ్యక్తిత్వ పోటీల్లో విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థిని ఎస్.కిరణ్మయి తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం దక్కించుకుంది. ఈ సందర్భంగా కిరణ్మయిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.మంజుల మంగళవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఆటరరీ కన్వీనర్ బి.రాధమ్మ, ఫిజికల్ డైరక్టర్ ఆర్.కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో టోర్నీలో ఇద్దరికి పతకాలు



కాంస్యపతక విజేతలు సాయి లోహిత్, భాగ్యరాజులతో డాక్టర్ మధుకుమార్, డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 10: రాష్ట్ర స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ టోర్నీలో బుల్లయ్య కళాశాల విద్యార్థులు సాయి లోహిత్, భాగ్యరాజు పతకాలు సాధించారు. తిరుపతిలో జరిగిన ఈ టోర్నీ 54 కిలోల విభాగంలో సాయి లోహిత్ స్వర్ణం కైవసం చేసుకోగా, 87 కిలోల కేటగిరిలో భాగ్యరాజు కాంస్య పతకం సాధించారు. మంగళవారం కళాశాల కార్యదర్శి డాక్టర్ మధుకుమార్,వ్యాయామ విద్య విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, డైరెక్టర్లు డాక్టర్ బీఆర్ఎస్ లక్ష్మణరెడ్డి, అసిస్టెంట్ డీన్ మేజర్ బ్రహ్మానందరెడ్డి అభినందించారు.

మత్స్యజాతుల సంరక్షణపై అవగాహన



వేదికపై ఆసీనులైన ప్రముఖులు

మహారాణిపేట, సెప్టెంబరు 10: సముద్రంలో అరుదైన మత్స్య జాతుల సంరక్షణపై కేంద్ర సముద్ర ఉత్పత్తుల పరిశోధన సంస్థ మత్స్యకారులకు అవగాహన కల్పించింది. మంగళవారం ఫిషింగ్ హార్బర్‌లోని బోట్ ఆపరేటర్ల సంఘ కార్యాలయంలో సదస్సు నిర్వహించారు. ఐసీఏఆర్ సీఎంఎఫ్ఆర్ఐ ప్రిన్సిపల్ డాక్టర్ జాయ్ కే కూఝూ కుదాన్, డాక్టర్ పి.రంజన్ బెహరాలు సముద్ర జాతుల సంరక్షణ, అరుదైన మత్స్య సంపద అంతరించిపోకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సముద్ర తాబేళ్లు, డాల్ఫిన్ల సంరక్షణకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. ఈ సమావేశంలో అధ్యక్షుడు లక్ష్మణరావు, నరసింగరావు, పరశురామ్, ఎల్లారావు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అత్యున్నత స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

కేంద్ర క్రీడల ప్రచార కమిటీ కార్యదర్శి ప్రసాద్ మహంకర్



కేంద్ర క్రీడల ప్రచార కమిటీ కార్యదర్శి ప్రసాద్ మహంకర్‌ను సన్మానించి జ్ఞాపిక అందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 10: క్రీడా భారతి నుంచి అనేక మంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదిగారని కేంద్ర క్రీడల ప్రచార కమిటీ కార్యదర్శి ప్రసాద్ మహంకర్ పేర్కొన్నారు. విశాఖలో పర్యటించిన ఆయన స్థానిక క్రీడా భారతి ప్రతినిధులు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, శిక్షకులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. క్రీడా భారతిని సామాజిక సేవా సంస్థగా అభివర్ధించారు. విద్యార్థులను ఉన్నత స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నగదు బహుమతులను అందించాలని జాతీయ క్రీడా భారతి నిర్ణయించిందని తెలిపారు. ఇకపై జాతీయ స్థాయి టోర్నీల్లో ప్రథమ స్థానానికి రూ.లక్ష, ద్వితీయ స్థానానికి రూ.50 వేలు, తృతీయ స్థానానికి రూ.30 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు. నిపుణులైన శిక్షకుల కోసం స్థానిక క్రీడాభారతి ప్రతినిధులు కృషి చేయాలన్నారు. ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, మాజీ ఒలింపియన్ ఎంవీ. మాణిక్యాలు, రైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడల అభివృద్ధికి సహకరించండి

ప్రసాద్ మహంకర్, ఎమ్మెల్యే గణబాబు మంగళవారం పలు అంశాలపై చర్చించారు. గ్రామీణ క్రీడల అభివృద్ధి, ప్రతిభ గల వర్ధమాన ఔత్సాహిక క్రీడాకారులకు అందించే ప్రోత్సాహం వంటి అంశాలపై ఎమ్మెల్యే నుంచి పలు సలహాలు, సూచనలు తీసుకున్నారు. సంక్రాంతి రోజుల్లో 16 ఏళ్లలోపు బాల బాలికలకు వాలీబాల్, అథ్లెటిక్స్, చదరంగం తదితర క్రీడాంశాల్లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. డిసెంబరు 9న జరగనున్న జాతీయ స్థాయి స్పోర్ట్సు క్విజ్ పోటీల్లో ఎక్కువ మంది బాల బాలికలు ప్రాతినిధ్యం వహించేలా చొరవ చూపాలన్నారు. ఇందుకు గణబాబు సానుకూలంగా స్పందించారు.

'సవాళ్లను అధిగమిస్తూ బాబు పాలన'



సమావేశంలో మాట్లాడుతున్న గండి బాబ్జీ

మహారాణిపేట, సెప్టెంబరు 10: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత సవాళ్లు ఎదురైనా వాటిని అధిగమించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలన సాగిస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ అన్నారు. మంగళవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే కృష్ణా నదికి వరదలు వచ్చాయని జగన్ అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు ఏడుపదుల వయస్సులో విజయవాడలోని వరద ప్రాంతాల్లో పర్యటిస్తూ సహాయక చర్యలు పర్యవేక్షించారని, అదే జగన్ అయితే ఏరియల్ సర్వే చేసి మమ అనిపించేవారన్నారు. జగన్ వరద బాధితులకు కోటి రూపాయలు ఇచ్చి చేతులు దులుపుకొన్నారని ఆక్షేపించారు. చంద్రబాబును అక్రమంగా జగన్ జైలుకు పంపి ఏడాది అయ్యిందని, అతడి పోకడ చూసి రాష్ట్ర ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారని అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను చూసి జగన్ బుద్ధి తెచ్చుకోవాలన్నారు. ఉత్తరాంధ్రలో సమస్యలు పరిష్కరిస్తామని, చంద్రబాబు సారథ్యంలోనే రాష్ట్రం పురోభివృద్ధి సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజలు సహకరించాలని కోరారు. సమావేశంలో టీడీపీ అధికార ప్రతినిధి గొంప కృష్ణ, ఉరుకటి నారాయణరావు, విల్లూరి చక్రవర్తి, ఈతలపాక సుజాత, టి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితి ఉత్సవాల్లో ఎంపీ, ఎమ్మెల్యే



సీతమ్మధారలో వినాయక వేడుకల్లో పాల్గొన్న ఎంపీ శ్రీభరత్, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తదితరులు



ఆక్సిజన్ టవర్స్‌లో రూ.4.5 లక్షలకు వేలం పాడుకున్న గణపతి లడ్డూ ప్రసాదం



30వ వార్డు సాలిపేటలో కొలువుదీరిన నిలువెత్తు వినాయకుడు

సీతంపేట, సెప్టెంబరు 10: సీతంపేట దుర్గాగణపతి ఆలయంలో నాలుగో రోజు స్కంద గణపతి అవతారంలో అలంకరించారు. సుబ్రహ్మణ్య స్వామిని తన తొడపై కూర్చోబెట్టుకొని దుర్గాగణపతి భక్తులకు దర్శనమిచ్చారు. సత్యహరిశ్చంద్ర నాటికను ప్రదర్శించారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవరసిద్ధి వినాయక చవితి పూజా మహోత్సవాల్లో ఎంపీ శ్రీభరత్, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, అరుకు పార్లమెంటరీ ఇంచార్జ్ పరశురామరాజు, టీడీపీ జిల్లా ప్రెసిడెంట్ గండి బాబ్జీ, వెల్లంగి భరత్, సురేష్‌బాబు, రాకేష్ పాల్గొన్నారు. ఆక్సిజన్ టవర్స్‌లో గణనాథుని 50 కేజీల లడ్డూ ప్రసాదాన్ని హర్ష, పల్లవి దంపతులు రూ.4.5 లక్షలకు వేలంలో పాడుకున్నారు. హెచ్‌బీ కాలనీ భానునగర్‌లోని వి.కె. రెసిడెన్సీలో వేద పండితుడు కమాలకరశాస్త్రి ఆధ్వర్యంలో లక్ష్మీ గణపతి యాగం జరిపారు. ఇక్కడి మహిళలు కోలాట నృత్యం చేశారు.

జగదాంబ కూడలి: టర్నర్ చౌల్ట్రీ దరి గ్రేటర్ 30వ వార్డు సాలిపేట ప్రాంతంలో యంగ్ రాక్ స్టార్స్ ఏర్పాటు చేసిన నిలువెత్తు వినాయకుడి విగ్రహాన్ని తిలకించేందుకు వన్‌టౌన్ ప్రాంత ప్రజలు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. వరసిద్ధి వినాయక వర్తక సంఘం ఏర్పాటు చేసిన గణపతికి ప్రత్యేకత ఉంది. ఇక్కడ హుండీ లేకుండా నిర్వాహకులు జాగ్రత్త తీసుకున్నారు. సొంత నిధులతో అయిదారేళ్లుగా మెయిన్ రోడ్డు వద్ద ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు వర్తక సంఘం కార్యదర్శి గంగాడ గోవింద్ వెల్లడించారు.





కార్యక్రమంలో జ్యోతిని వెలిగిస్తున్న నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వీసీ బాలమోహన్‌దాస్ తదితరులు, హాజరైన వృద్ధులు

వృద్ధులకు విశ్రాంతి భవనం నిర్మించాలి

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 10 : నగరంలో సుమారు మూడు లక్షల మంది వయో వృద్ధులు ఉన్నారని వీరికి వినోదం, కాలక్షేపం, విశ్రాంతి కోసం ఒక విశాలమైన భవనం అవసరమని నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్ డిమాండ్ చేశారు. మంగళవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో విశాఖ జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ రోశయ్య ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఇచ్చిన ఆదేశాల్లో భాగంగా బీచ్‌రోడ్డులో 1560 గజాల స్థలంలో భవన నిర్మాణానికి శంకుస్థాపన జరిగిందని, ఇప్పుడు ఆ ప్రాంతం దుర్భరంగా ఉందన్నారు. వుడా ఉన్నతాధికారులు ఎవరూ స్పందించలేదన్నారు. కార్యక్రమానికి సంఘం అధ్యక్షుడు కె.మంగపతి అధ్యక్షత వహించి మాట్లాడుతూ నగరంలోని వయోవృద్ధులంతా సంఘటితమై కృషి చేయాలన్నారు. సంఘం కార్యదర్శి డా.పి.కె.జోష్, మెజీషియన్ కె.రవిశంకర్, డా.జ్యోత్స్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ వద్దు'



గురుద్వార కూడలిలో నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు, డ్రైవర్లు

సీతంపేట, సెప్టెంబరు 10: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ వెంటనే రద్దు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. గురుద్వార కూడలిలోని ఆటో స్టాండ్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. వామనమూర్తి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక విశాఖ ఉక్కు పరిశ్రమ, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించి దేశ సంపదను కొల్లగొడుతున్నారని మండిపడ్డారు. ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని, దీనికి అవసరమైన బొగ్గు, ఇసుక, ఉక్కు గుండు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సంస్థలను ప్రైవేటీకరించే చర్యలు వెంటనే ఆపకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రావికృష్ణ, ఎస్.పాపారావు, ఎస్.సూరిబాబు, ఎ.నర్సింగ్ మూర్తి, పి.బుజ్జి, రవి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాతనగరంలో నీటికోసం అవస్థలు

జగదాంబ కూడలి, సెప్టెంబరు 10: ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలకు రిజర్వాయర్లు నిండుకుండలా మారినా జీవీఎంసీ అరకొరగా నీటిని సరఫరా చేయడంతో పాతనగరం ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతోంది. సోమవారం కుళాయి ద్వారా మంచి నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు అనేక అవస్థలు పడ్డారు. పాత నగరంలోని జగదాంబ జంక్షన్ 30వ వార్డు నుంచి గ్రేటర్ 39వ వార్డు పాత పోస్టాఫీసు వరకు ప్రజలకు కుళాయి నీరే ఆధారం. ఒక్కరోజు సరఫరాకు ఇబ్బంది ఎదురైనా ప్రజల కనీస అవసరాలు తీర్చుకోవడం కష్టమే. ఇలాంటి సందర్భాల్లో జీవీఎంసీ అధికారులు ట్యాంకర్లను పంపిస్తుంటారు. శని, ఆదివారాల్లో కురిసిన ఎడతెరిపిలేని వానల ప్రభావంతో సోమవారం నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయి ఇబ్బందులు ఎదురయ్యాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం కూడా అరకొరగా నీరు ఇవ్వడంతో కుళాయి వద్ద నీటి కోసం ఎదురుచూసిన మహిళలు అసంతృప్తి వ్యక్తం చేశారు. పాతనగరం వాసులకు నీటికష్టాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. బుధవారం నుంచి ఇబ్బందులు లేకుండా చూస్తామని సంబంధిత వర్గాలు తెలిపాయి.

భయపెడుతున్న శునకాలు

మురళీనగర్, సెప్టెంబరు 10 ; విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని మాదవధార ఉడాకాలనీ, 49వ వార్డు బర్మాక్యాంపు ప్రాంతాల్లో వీధికుక్కల ఆగడాలతో స్థానికులు సతమతమవుతున్నారు. ఇళ్ల చుట్టూ పగలు రాత్రి తిరుగాడే కుక్కలు పిల్లలను గాయపరుస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో రాకపోకలు సాగించే వారికి మరింత ఇబ్బందిగా మారిన వీధి కుక్కలను నియంత్రించాలని ఈ ప్రాంతాల వారు కోరుతున్నారు. మాధవధార ఉడాకాలనీలో బైక్స్, కార్ల వెంట పరుగులు పెడుతున్న కుక్కలు వాహనదారులను ప్రమాదాలకు గురిచేస్తున్నాయి.

సీఐల బదిలీ

విశాఖపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ సీపీ శంఖబ్రతబాగ్చి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. వీఆర్‌లో ఉన్న కొందరికి పోస్టింగ్ ఇచ్చారు. ఆనందపురం సీఐగా పనిచేస్తున్న టీవీ తిరుపతిరావును రేంజ్ వీఆర్‌కు సరండర్ చేశారు. ఆ స్థానంలో ఏఎస్ఆర్ జిల్లా ఎన్‌డీపీఎస్ టాస్క్ ఫోర్స్ సీఐగా పనిచేస్తున్న సీహెచ్ వాసునాయుడికి పోస్టింగ్ ఇచ్చారు. గాజువాక సీఐగా పనిచేస్తున్న మరడాన శ్రీనివాసరావును రేంజ్ వీఆర్‌కు సరండర్ చేశారు. ఆయన స్థానంలో త్రీటౌన్ సీఐగా పనిచేస్తున్న ఎ.పార్థసారధిని నియమించారు. అనకాపల్లి జిల్లా వీఆర్‌లో ఉన్న పల్లా రమణయ్యకు త్రీటౌన్ సీఐగా పోస్టింగ్ ఇచ్చారు. స్పెషల్‌బ్రాంచి (పొలిటికల్) సీఐగా పనిచేస్తున్న వానపల్లి రామారావును కంచరపాలెం సీఐగా, సిటీ వీఆర్‌లో ఉన్న వాసంశెట్టి శ్రీనివాసరావును ఆరిలోవ సీఐగా నియమించారు.

ముగ్గురు ఎస్ఐలకు స్థానచలనం

పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న ముగ్గురు ఎస్ఐలను బదిలీ చేస్తూ సీపీ శంఖబ్రతబాగ్చి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. వీఆర్‌లో ఉన్న ఐ.నాగరాజుకు గాజువాక ట్రాఫిక్ ఎస్ఐగా పోస్టింగ్ ఇచ్చారు. పీఎం పాలెం క్రైమ్ ఎస్ఐగా పనిచేస్తున్న గొండేల ప్రసాద్‌ను పీఎం పాలెం ట్రాఫిక్ ఎస్ఐగా బదిలీ చేశారు. పోర్ట్ ఇమ్మిగ్రేషన్ ఎస్ఐగా, పోలీస్ పీఆర్‌ఓగా పనిచేస్తున్న ఎస్.కృష్ణవర్మను దువ్వాడ ట్రాఫిక్ ఎస్ఐగా బదిలీ చేశారు.

అప్రమత్తంగా ఉండండి

... 5వ పేజీ తరువాయి

ఎనిమిది తేదీల్లో కురిసిన భారీవర్షాల వల్ల జిల్లాలో కొంత మేర నష్టం వాటిల్లినట్టు తెలిపారు. ఎక్కడికక్కడ సహాయ చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జాయింట్ పోలీస్ కమిషనర్ డాక్టర్ కె.ఫకీరప్ప, విశాఖపట్నం జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, పి.భాస్కర్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారులు, జీవీఎంసీ, పౌర సరఫరా, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

89 చోరీ కేసుల్లో 80 మంది అరెస్టు

... 5వ పేజీ తరువాయి

బంగారం, నగదు, ద్విచక్ర వాహనాలు, ఆటోలతోపాటు 255 సెల్‌ఫోన్‌లు రికవరీ చేశారన్నారు. ప్రతి నెలా కేసుల ఛేదనతోపాటు రికవరీ పెంచాలన్న లక్ష్యానికి అనుగుణంగా క్రైమ్ డీసీపీ లతామాధురి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారని అభినందించారు. వారందరికీ త్వరలో రివార్డులు అందజేయనున్నట్టు ప్రకటించారు. అనంతరం రికవరీ చేసిన సొత్తును బాధితులకు సీపీ చేతులు మీదుగా అందజేశారు. ఈ సమావేశంలో జాయింట్ సీపీ ఫకీరప్ప, క్రైమ్ డీసీపీ కె.లతా మాధురి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీలేరు, భద్రాచలం బస్సులు రద్దు

... 5వ పేజీ తరువాయి

నేపథ్యంలో మొత్తం గండ్లు, గోతులు పూడ్చిన తరువాత ట్రయల్ రన్ వేసిన తరువాత ప్రయాణికులకు సేవలు అందిస్తామని అధికారులు వెల్లడించారు. ఆర్ అండ్ బి అధికారులకు ఇప్పటికే సమాచారం ఇచ్చినట్టు అధికారులు తెలిపారు.

నేటి నుంచి అరకు బస్సుల పునరుద్ధరణ

భారీవర్షాలు, వరదలు కారణంగా విశాఖ నుంచి అరకులోయ రాకపోకలు సాగించే మూడు బస్సులను గత శనివారం నుంచి నాలుగు రోజుల పాటు రద్దు చేశారు. ప్రస్తుతం పరిస్థితులు అనుకూలించడంతో బుధవారం నుంచి ఈ సర్వీసులను పునరుద్ధరించనున్నట్టు రీజియన్ అధికారులు ప్రకటించారు. విశాఖపట్నం నుంచి మాడుగుల, పాడేరు వెళ్లాల్సిన సర్వీసులను చోడవరం వరకు మాత్రమే నడుపుతు న్నారు. భారీ వర్షాల కారణంగా చోడవరం నుంచి మాడుగుల, పాడేరు రూట్‌లు బాగా పాడయ్యాయి. ప్రయాణికులతో ఈ రూట్లలో బస్సులు నడపడం అంత క్షేమం కాదని బస్సులు చోడవరం వరకే నడిపేందుకు నిర్ణయించారు.

రోడ్డెక్కిన ఉక్కు కార్మికులు

... 5వ పేజీ తరువాయి

అణచివేయడం తగదన్నారు. ఉక్కు కార్మికులను నిర్బంధించాలని చూస్తున్న ప్రభుత్వాలకు బుద్ధి వచ్చేలా చేస్తామన్నారు. పోలీసులు మద్దతు ఇస్తామని చెప్పి కార్మికులకు వెన్నుపోటు పొడుస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించే చర్యలను నిలుపు చేయాలని కోరారు. జె.అయోధ్యరామ్, పరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయించకుండా ప్రభుత్వం చోద్యం చూడడం అన్యాయమన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం తక్షణమే వెనక్కి తీసుకోకపోతే, తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ మాట్లాడుతూ ఉక్కు కర్మాగారానికి సొంత గనులను కేటాయించాలన్నారు. ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవలసిన బాధ్యత రాష్ట్రంలో ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, నిర్వాసిత నాయకులు ఎస్.గంగారామ్, పులి వెంకటరమణారెడ్డి, కేఎస్ఎన్ రావు, ఎస్.రామారావు, నీరుకొండ రామచంద్రరావు, జెర్రిపోతుల ముత్యాలు, బొడ్డు పైడిరాజు, విళ్ల రామ్మోహన్‌కుమార్, దొమ్మేటి అప్పారావు, పెంటారావు, శ్రీనివాసులు నాయుడు, ప్రగడ వేణుబాబు, వీవీ రమణ, యు.రామస్వామి, వి.ప్రసాద్, వెంకటేశ్వరరావు, గంగవరం గోపి, మాటూరి రాము, గణపతిరెడ్డి, రమణ, మాటూరి శ్రీనువాస్, గుమ్మడి నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న రహదారులు

... 5వ పేజీ తరువాయి

దారుణంగా తయారైంది. వాహన చోదకులు గోతులను తప్పించే యత్నంలో కొందరు పక్క నుంచి వెళ్లే వాహనాలను ఢీకొంటున్నారు. మరికొందరు భారీ వాహనాల వెనుక వెళుతూ...రోడ్డుపై ఏర్పడిన గోతులను గమనించక అదుపుతప్పి పడిపోతున్నారు. నగరంలోని అంతర్గత రహదారుల పరిస్థితి కూడా అదే మాదిరిగా తయారైంది. శివాజీపాలెంలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ క్యాంపు కార్యాలయం సమీపంలో వర్షం నీరు నిలిచిపోవడంతో రోడ్డు కుంగిపోయింది. రోడ్డు మధ్యలో భారీ గొయ్యి ఏర్పడింది. వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతుండడంతో స్థానికులు కొందరు గొయ్యిపై పాడైపోయిన వెదురు కుర్చీని ఉంచారు. పీతాపురం కాలనీ ఆంధ్రా బ్యాంకు రోడ్డు కూడా వర్షం నీరు నిలిచిపోవడం కారణంగా కుంగిపోవడంతో గొయ్యి ఏర్పడింది. వాహన చోదకులు ఆ గొయ్యిని గమనించకుండా ప్రమాదాలకు గురవుతున్నారు. మద్దిలపాలెం ఆర్టీసీ డిపో ఎదురుగా జాతీయ రహదారిపై రోడ్డుపై భారీ గొయ్యి ఏర్పడింది. మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్ పక్కన ఉన్న బస్‌బే ఎదురుగా రోడ్డుపై భారీ గొయ్యి ఏర్పడడంతో వాహన చోదకులు గుర్తించేందుకు వీలుగా గోతిలో కర్రలు పెట్టారు.

రూ.12 కోట్లతో మరమ్మతులకు జీవీఎంసీ సన్నద్ధం

గత 15 రోజుల్లో కురిసిన వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లను రూ.12 కోట్లతో మరమ్మతు చేసేందుకు జీవీఎంసీ సన్నద్ధమవుతోంది. వర్షాల వల్ల జీవీఎంసీ పరిధిలో 22 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నట్టు అధికారులు గుర్తించారు. కొన్నిచోట్ల రోడ్లపై భారీగోతులు ఏర్పడినందున వాటిని ప్రత్యేక జాగ్రత్తలతో పూడ్చాల్సి ఉంటుందని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. దెబ్బతిన్న రోడ్లను రిపేరు చేయాలంటే రూ.12 కోట్లు ఖర్చు అవుతుందని అంచనాలు తయారుచేసిన అధికారులు ఉన్నతాధికారుల ఆమోదానికి పంపించారు. కమిషనర్ ప్రస్తుతం విజయవాడలో ఉన్నందున ఆయన రాగానే రోడ్ల మరమ్మతులకు సంబంధించిన పనులను చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులు భావిస్తున్నారు. వీలైనంత త్వరగా రోడ్లను మరమ్మతు చేయకపోతే ప్రమాదాలు పెరగడం ఖాయమని నగరవాసులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఆరోగ్య శాఖపై ఫిర్యాదుల వెల్లువ

... 5వ పేజీ తరువాయి

అధికారులకు ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పలువురికి ఉద్యోగాలు ఇచ్చారంటూ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే క్లాస్-4, జూనియర్ అసిస్టెంట్, ఎఫ్ఎన్‌వో, ఎంఎన్‌వో పోస్టులకు సంబంధించి చేపట్టిన బదిలీలు, పదోన్నతుల్లో భారీగా డబ్బులు చేతులు మారాయని, అస్మదీయులకు మేలు చేశారంటూ ఆరోగ్య శాఖలో ఏవోగా పనిచేసి పదవీ విరమణ చేసిన ఒకరు అప్పట్లో సూపరింటెండెంట్‌గా పనిచేసిన అధికారిపై ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేస్తున్న విజిలెన్స్ అధికారులు తాజాగా ఆయా నియామకాలకు సంబంధించిన వివరాలు ఇవ్వాలంటూ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారికి లేఖ రాశారు. అలాగే, ఆంధ్ర మెడికల్ కాలేజీ పరిధిలో కొన్నాళ్ల కిందట పలు పోస్టులను భర్తీచేశారు. ఆ పోస్టుల భర్తీలో అక్రమాలు జరిగాయని, తనకు రావాల్సిన ఉద్యోగాన్ని ఫేక్ సర్టిఫికెట్లు పెట్టిన వారికి ఇచ్చారంటూ ఒక యువతి జిల్లా కలెక్టర్, డీఎంఈ, ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపై విచారణ చేసిన అధికారులు అడ్డగోలుగా ఉద్యోగాలు పొందిన ఇద్దరిని కొద్దిరోజుల కిందట విధుల నుంచి తొలగించారు. అయితే, ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణకు డీఎంఈ ఆదేశించినట్టు తెలిసింది.



యాతపాలెంలో పైపు లైన్ నుంచి లీక్ అవుతున్న నీరు

వృథాగా పోతున్న తాగునీరు

పెదగంట్యాడ, సెప్టెంబరు 10: జీవీఎంసీ 64వ వార్డు పరిధి యాతపాలెం కాలనీకి తాగునీరు అందించే పైపు లైన్ లీక్ అవుతుంది. దీంతో తాగునీరు డ్రైనేజీలో కలిసిపోతుంది. మూడు నెలలుగా వృథాగా నీరు పోతుండడం వల్ల కొళాయిల ద్వారా తమకు వచ్చే నీటి సామర్థ్యం తగ్గిపోతుందని ప్రజలు వాపోతున్నారు. ఈ సమస్యను టీడీపీ నాయకుడు సంపంగి సూరిబాబు జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకునే నాథులే కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

మేహాద్రిగెడ్డ పరివాహక ప్రాంతాల్లో పర్యటించిన పంచకర్ల

గోపాలపట్నం, సెప్టెంబరు 10: జీవీఎంసీ 88వ వార్డు పరిధిలోని నరవ పరిసర ప్రాంతాల్లో, మేహాద్రిగెడ్డ పరివాహక ప్రాంతాల్లో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మంగళశారం పర్యటించారు. ఈ సందర్భంగా కొత్తపాలెం-నరవ ప్రధాన రహదారిలో ముంపు ప్రాంతాన్ని తిలకించారు. అనంతరం నరవలోని లోతట్టు ప్రాంతాలను పరిశీలించి ముంపు సమస్య ఉన్న ప్రాంతాల్లో తీసుకోవాల్సిన నివారణ చర్యలపై అధికారులతో చర్చించారు. నరవ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి, అక్కడి సమస్యల గురించి ఆరా తీశారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట టీడీపీ, జనసేన నాయకులు ఉన్నారు.

వృద్ధాశ్రమానికి మంచాలు వితరణ

పెందుర్తి, సెప్టెంబరు 10: బాల సురక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఇక్కడి లయోలా వృద్ధాశ్రమానికి ఆరు స్టీల్ మంచాలను వితరణగా అందజేశారు. వీటిని సంస్థ వ్యవస్థాపకులు శ్రీరాజ్ గొర్ల వృద్ధాశ్రమ నిర్వాహకులకు అందించారు. అనంతరం ఆశ్రమంలోని వృద్ధులకు భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి నిర్మలానంద, సుగుణ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

95వ వార్డులో అన్నదానం

పెందుర్తి-రూరల్, సెప్టెంబరు 10: గ్రేటర్ 95వ వార్డు పరిధి పాపయరాజుపాలెం బీసీ కాలనీలో నిర్వహిస్తున్న వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణపతి మండపం వద్ద మంగళవారం అన్న సమారాధన చేపట్టారు. కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కృష్ణమూర్తి, సూర్యకుమారి, చిన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'పింఛన్‌దారులకు న్యాయం చేయాలి'

మల్కాపురం, సెప్టెంబరు 10: కేంద్ర పరిధిలో పింఛన్‌దారులకు ప్రభుత్వం న్యాయం చేయాలని జిల్లా పెన్షన్‌దారుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్‌కే హుస్సేన్ డిమాండ్ చేశారు. మల్కాపురంలోని సీఐటీయు కార్యాలయంలో మంగళవారం ఉదయం పెన్షన్‌దారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో హయ్యర్ పెన్షన్ అమలు కోసం శాంతయుతంగా ఆందోళన చేస్తున్న పింఛన్‌దారులపై పోలీసులు అమానుషంగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. హయ్యర్ పెన్షన్ కోసం సుమారు 77 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే కేవలం ఎనిమిది వేల మందికి దానిని అమలు చేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి పెన్షన్‌దారులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు, పలువురు పెన్షన్‌దారులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్:** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీకన్య, కిన్నెర, శారద, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీకాంత్ (గాజువాక).
● **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1,2 (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
● **మారుతీనగర్ సుబ్రహ్మణ్యం :** నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)
● **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), హెవెన్-3 (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
● **కమిటీ కుర్రోళ్ళు :** శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
● **తంగలాన్ :** నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 48, టమాటా 30, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 48, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 30, బీరకాయలు 42, ఆనపకాయ 30, కాలీఫ్లవర్ 34, క్యాబేజీ 24, క్యారెట్ 30, దొండకాయలు 44, బంగాళదుంపలు 29, అరటికాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 130, మునక్కాడలు (కిలో) 45, బరబాటి 42, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 105, గోరుచిక్కుడు 34, దోసకాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 105, పొటల్స్ 44, కీరదోస 32, క్యాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 54, కంద 54, దేముడు చిక్కుడు 70, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 26, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	89
ఫారం ధర	--	109
విత్ స్కిన్	--	188
స్కిన్‌లెస్	--	198

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

పూడుకుపోయిన కాలువలు

» ఆందోళన చెందుతున్న లోతట్టు ప్రాంతాల ప్రజలు

» మరో బుడమేరు చేయవద్దంటూ శీలానగర్ వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు



గెయిల్ కంపెనీ ప్రహరీ వద్ద చెల్లాచెదారం, మట్టితో పూడుకుపోయిన కాలువ



శీలానగర్ వద్ద హైవేపై మరో బుడమేరు చేయవద్దంటూ ప్రజలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 10: శీలానగర్ అవుట్‌లెట్ నుంచి వరద నీరు బయటకు పోయేందుకు ఏర్పాటు చేసిన కాలువలు పూడుకుపోతుండడం పట్ల శీలానగర్ పరిసర లోతట్టు ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ కాలనీలను మరో బుడమేరు బాధితులుగా చేయవద్దంటూ జాతీయ రహదారిలోని శీలానగర్ వద్ద వారు ఫ్లెక్సీని ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది. వర్షాకాలంలో ఏటా నాతయ్యపాలెం కృష్ణమహంతి చెరువుతో పాటు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు హరిజన జగ్గయ్యపాలెం, మాజీ సైనికుల కాలనీ, వెంకటేశ్వర కాలనీ, శీలానగర్ పరిసరాల్లోని కాలనీలు వరద ముంపునకు గురవ్వడంగా పరిపాటిగా మారింది. 2005లో ఈ సమస్యను గుర్తించిన అధికారులు సుమారు ఏడు కోట్ల రూపాయల వ్యయంతో శీలానగర్ నుంచి జాతీయ రహదారి వరకు అవుట్‌లెట్ నిర్మించారు.

దీనికి అనుసంధానంగా గత సంవత్సరం మరో అవుట్‌లెట్‌ను నిర్మించడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఎంతో సంబరపడ్డారు. ఈ అవుట్‌లెట్ ద్వారా వెళ్లే వరద నీరు జాతీయ రహదారిపై ఉన్న చిన్న వంతెన లోనుంచి గెయిల్ కంపెనీ ప్రహరీకి ఆనుకుని ఉన్న కాలువ ద్వారా సముద్రంలో నేరుగా కలుస్తుంది. అయితే ప్రస్తుతం జాతీయ రహదారికి అవతల వైపు ఉన్న కాలువ గెయిల్ ప్రహరీ వద్ద మట్టితో కొంత భాగం మూతపడగా, మిగిలిన కాలువ చెత్తతో పూడుకుపోయి కుదించుకుపోయింది. ఈ కాలువలు మూతపడడంతో తమ కాలనీలు వరద ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని లోతట్టు ప్రాంత ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అందువల్ల అధికారులు ఈ సమస్యను పరిష్కరించి అవుట్‌లెట్ నుంచి నీరు సజావుగా సముద్రంలో కలిసేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆటోనగర్ ఎఫ్-బ్లాక్‌లో రోడ్డు మధ్యలో వర్షపు నీటితో నిండిన భారీ గొయ్యి



గోతులతో నిండిన ఆటోనగర్ డి-బ్లాక్ రహదారి

నరకదారులు!

వర్షాలకు అధ్వానంగా మారిన ఆటోనగర్ రోడ్లు



ఈ మార్గంలో ఆదమరిచి వాహనం నడిపితే అంతే సంగతులు..

ఆటోనగర్, సెప్టెంబరు 10: వాయుగుండం ప్రభావంతో మూడు రోజుల పాటు తెరిపివ్వకుండా కురిసిన పలుచోట్ల రహదారులు దారుణంగా తయారయ్యాయి. అడుగుల మేర గోతులు పడడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు నరకయాతన పడుతున్నారు. ఆయా మార్గాల్లో ఏ మాత్రం ఏమరుపాటుగా వాహనం నడిపినా కిందపడడం ఖాయమని పలువురు ద్విచక్ర వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్ష బీభత్సానికి 71వ వార్డు ఆటోనగర్‌లోని రోడ్లు ఛిద్రంగా మారాయి. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే తుంగ్లాం, ఆటోనగర్, చట్టివానిపాలెం, యాదవ జగ్గరాజుపేట, కాపు జగ్గరాజుపేటతో పాటు ఆటోనగర్‌లో పలు కర్మాగారాలకు వెళ్లే ఉద్యోగులు, కార్మికులతో పాటు ప్రజలు నానాపాట్లు పడుతున్నారు. భారీ గోతులు ఏర్పడిన ఆయా రహదారుల స్థానంలో కొత్తవి నిర్మించవలసిందిగా ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగించాలి

అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకుల డిమాండ్

మల్కాపురం, సెప్టెంబరు 10: స్టీల్ ప్లాంటును కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ హెచ్‌పీసీఎల్ గేటు వద్ద అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలనే యోచనను కేంద్రం విరమించుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉక్కు కర్మా గారానికి సొంత గనులు రాకుండా చేస్తుందని మండిపడ్డారు. అలాగే ఉద్యోగులను తగ్గించేందుకు ప్రయత్నిస్తుండడం దారుణ మన్నారు. ఈ విషయంపై కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగేలా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇంటక్ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం, నాయకులు తాతబాబు, నర్సింగ్, సీఐటీయూ నాయకులు కె.పెంటారావు, పి.పైడిరాజు, జి.నరేశ్, ఎం.కృష్ణారావు, పి.సురేశ్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌పీసీఎల్ గేటు వద్ద ఆందోళన చేస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు



పాత గాజువాక కూడలిలో రాస్తారోకో చేస్తున్న నాయకులు, కార్మికులు

టీఎన్‌టీయుసీ ఆధ్వర్యంలో..

షిప్‌యార్డు గేటు వద్ద టీఎన్‌టీయుసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆందోళన చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఎంతోమంది ప్రాణ త్యాగాలతో స్టీల్‌ప్లాంట్ ఏర్పడిందని, అటువంటి కర్మాగారాన్ని ప్రైవేటీకరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇప్పుడైనా కేంద్రం ప్లాంట్ ప్రైవేటీకరణ యోచనను విరమించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రంజాన్ ప్రసాద్, పి.కృష్ణ, పి.భూలోకరాజు, కె.ఆదినారాయణ, రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.

పాత గాజువాకలో రాస్తారోకో

గాజువాక: స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ప్రైవేటీకరించవద్దని డిమాండ్ చేస్తూ వామపక్షాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాత గాజువాక జంక్షన్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటుపై కేంద్రం దుర్మార్గంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్రం మొండి వైఖరిని విడనాడి ప్లాంట్ విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలన్నారు. కాగా ఆందోళనకారులను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తులపై విడుదల చేశారు.

ఇసుక అమ్మకాలపై సమగ్ర విచారణ జరపాలి

కూటమి నాయకుల డిమాండ్

అగనంపూడి, సెప్టెంబరు 10: అగనంపూడిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక డిపో వద్ద జరిగిన అమ్మకాలపై సమగ్ర విచారణ జరిపించాలని స్థానిక కూటమి నాయకులు డిమాండ్ చేశారు. ఇసుక డిపోను మంగళవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా ఇసుక సరఫరా చేయాలన్న లక్ష్యాన్ని అవినీతి అధికారుల కారణంగా నీరుగారిపోతుందన్నారు. ఇక్కడి డిపోలో గనులు, రెవెన్యూ శాఖ అధికారులు లారీ యజమానులతో కుమ్మకై ఇసుకను ఇష్టానుసారంగా అమ్ముకున్నారన్నారు. దీంతో సామాన్యులకు ఇసుక దొరకలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. డిపో పునఃప్రారంభం నుంచి ఇప్పటివరకు ఇసుక నిల్వలు, అమ్మకాల లెక్కలు చూస్తే అధికారుల బండారం బయటపడుతుందన్నారు. దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గంతకోరు అప్పారావు, బలిరెడ్డి సత్యనారాయణ, కసిపల్లి శ్రీనివాసరావు, పిల్లా త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.



అగనంపూడి ఇసుక డిపోను పరిశీలిస్తున్న కూటమి నాయకులు



కొత్త గాజువాక సీతారాంనగర్‌లో రాజీవ్ యూత్ ఆధ్వర్యంలో పూజలందుకుంటున్న గణనాథుడు



అక్కిరెడ్డిపాలెంలోని వెంకటేశ్వర కాలనీలో నందీశ్వరునిపై ఆశీనులైన ప్రమద గణేశుడు



బాజీ జంక్షన్‌లోని కరణాల వీధిలో శేషపాన్పుపై లక్ష్మీనృసింహస్వామి అవతారంలో విఘ్నేశ్వరుడు

పూజలందుకుంటున్న గణేశులు

వినాయక చవితి ఉత్సవాలను పలు ప్రాంతల్లో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మండపాలను శోభాయమానంగా అలంకరించారు. ఆయా మండపాల్లో వివిధ రూపాలలో గణనాథులు కొలువుదీరి పూజలు అందుకుంటున్నారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు ఉదయం, సాయంత్రం వేళ్లలో అధిక సంఖ్యలో విచ్చేసి గణేశులను దర్శించుకుంటున్నారు. ఉత్సవ కమిటీల నిర్వాహకులు భక్తులకు ప్రసాద వితరణ చేస్తున్నారు. పలుచోట్ల అన్న సమారాధనలు, దీపారాధనలు చేపడుతున్నారు. సాయంత్రం పూట పలు మండపాల వద్ద ఏర్పాటు చేస్తున్న భజనలు, సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాదుల శ్రీనివాస్

సీఎం చంద్రబాబును చూసి వైసీపీ నేతలు సిగ్గు పడాలి

టీడీపీ 'గాజువాక' సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్

గాజువాక, సెప్టెంబరు 10: విపత్తులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమర్థవంతంగా ఎదుర్కొన్నారని, ప్రజలకు సేవ చేసేందుకు నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై వైసీపీ మాజీ మంత్రులు లేనిపోని ఆరోపణలు చేయటం సిగ్గుచేటని తెలుగుదేశం పార్టీ గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పనితీరును చూసి వైసీపీ మాజీ మంత్రులు సిగ్గుపడాలన్నారు. విజయవాడలో సాధారణ పరిస్థితులను తీసుకువచ్చేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషి విశేషమైనదన్నారు. ఈ సమావేశంలో నాయకులు శివప్రసాద్, అనంత్, వెంకటరావు, సత్యారావు, చంద్రరావు, అజయ్‌కుమార్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

టెన్నికాయిట్ జిల్లా జట్ల ఎంపిక



ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

అగనంపూడి, సెప్టెంబరు 10: రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా టెన్నికాయిట్ సబ్ జూనియర్ బాలబాలికల జట్ల ఎంపికను మంగళవారం లంకెలపాలెంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ పోటీలను 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలోనూ ప్రతిభ చూపాలని కోరారు. అనంతరం ప్రతిభ ఆధారంగా జిల్లా స్థాయి జట్లను ఎంపిక చేశారు. ఎంపికైన జట్లు ఈ నెల 14 నుంచి 16 వరకు శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్‌వీ సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, అసోషియేషన్ ప్రతినిధులు కనకారావు, ఎంవీ నాగేశ్వరరావు, వివేకానంద, నారాయణమ్మ, రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులను ఉల్లంఘించరాదు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న గొండు సీతారామ్

శ్రీనగర్, సెప్టెంబరు 10: ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు బాలల హక్కుల ఉల్లంఘనలకు పాల్పడరాదని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ అన్నారు. స్థానిక టీఎస్సార్ టీబీకే కళాశాల ప్రాంగణంలో మంగళవారం ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలతో జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల మనోవికాసానికి ప్రభుత్వ నిర్దేశిత సెలవులను పాఠశాలల యాజమాన్యాలు విధిగా పాటించాలన్నారు. డీఈవో ఎల్.చంద్రకళ మాట్లాడుతూ పాఠశాల ప్రాంగణాల్లో ఫిర్యాదు బాక్సులను ఏర్పాటు చేయాలని, మత్తు పదార్థాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని, ఫీజులు చెల్లించలేదన్న నెపంతో విద్యార్థులను శిక్షించరాదన్నారు. బాలల హక్కులు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థులను పాఠశాలలకు తీసుకువచ్చే ఆటో డ్రైవర్లపై ఓ కన్నేసి ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి డాక్టర్ కాలేషా బేగం, ఎంఈవోలు సునీత, విశ్వనాథ్, రమణాజీ, శ్రీనివాస్, యాపిల్ స్కూల్ చైర్మన్ తలశిల బలరామకృష్ణ, కరస్పాండెంట్ తలశిల ఉమామహేశ్వరరావు, గ్రీన్ ఎంబసీ ఫౌండర్ ఉమారాజ్, సైకాలజిస్టు వంశీ, జిప్సా ప్రతినిధులు, సివిల్-లీగల్ రైట్స్ జిల్లా అధ్యక్షులు కె.రామలక్ష్మి, ఝాన్సీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రైతు బజారులో రైతులకు ఆటల పోటీలు



లెమెన్ అండ్ స్పూన్ ఆటలో నిమగ్నమైన మహిళా రైతులు

ఎన్.ఎ.డి.జంక్షన్, సెప్టెంబరు 10: జీవీఎంసీ 52వ వార్డు పరిధిలోని మర్రిపాలెం రైతు బజారులో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉన్న రైతులకు వివిధ ఆటల పోటీలను నిర్వహించారు. మహిళలకు లెమెన్ అండ్ స్పూన్, పురుషులకు రన్నింగ్, తదితర పోటీలు చేపట్టారు. వినాయక ఉత్సవాల ముగింపు రోజైన శుక్రవారం మార్కెట్‌లో అన్నదానం నిర్వహించనున్నట్టు రైతుబజారు ఎస్టేట్ ఆఫీసర్ వరహాలు తెలిపారు. నిత్యం వ్యాపారాలతో జీవనం సాగించే రైతులు ఈ ఆటల పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

జేసీఐ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 10: వైజాగ్ స్టీల్ సిటీ జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) ఆధ్వర్యంలో జేసీఐ వీక్ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు. ఇందులో భాగంగా మంగళవారం చోడవరం సమీపంలోని చీడికాడ వద్ద గల లలితాదేవి వృద్ధాశ్రమానికి నిత్యావసర సరకులు అందజేశారు. అలాగే వృద్ధాశ్రమ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం పెద్దలకు పాదపూజ చేశారు. కార్యక్రమంలో జేసీఐ స్టీల్ సిటీ అధ్యక్షుడు ధనుంజయ్, ప్రతినిధులు రమ, రవికుమార్, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి: సీఐ రామకృష్ణ

వేపగుంట సెప్టెంబరు 10: వేపగుంట శివారు ప్రాంతమైన వరలక్ష్మీనగర్‌లో గత కొద్ది రోజులుగా ఆకతాయిల హడావిడి, గంజాయి బ్యాచ్, అపరిచిత వ్యక్తుల హల్‌చల్ చేస్తుండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజులుగా అపరిచిత వ్యక్తులు రాత్రిపూట సంచరిస్తున్నారని పలువురు పెందుర్తి సీఐ రామకృష్ణకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం ఆయన ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ అప్రపత్తంగా ఉండాలని, కొత్త వ్యక్తులపై నిఘా పెట్టాలని, ఇంటికి తాళాలు వేసి ఊర్లకు వెళితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. సాధ్యమైతే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజల విజ్ఞప్తి మేరకు రాత్రి గస్తీని పక్కాగా నిర్వహించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.



కిరణ్మయికి ప్రశంసాపత్రం అందిస్తున్న ప్రిన్సిపాల్

కాంస్య పతక విజేతకు అభినందన

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 10: జీవిత బీమా సంస్థ 68వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన అంతర కళాశాలల వ్యక్తిత్వ పోటీల్లో విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థిని ఎస్.కిరణ్మయి తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం దక్కించుకుంది. ఈ సందర్భంగా కిరణ్మయిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.మంజుల మంగళవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అటరీ కన్వీనర్ బి.రాధమ్మ, ఫిజికల్ డైరక్టర్ ఆర్.కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో టోర్నీలో ఇద్దరికి పతకాలు



కాంస్యపతక విజేతలు సాయి లోహిత్, భాగ్యరాజులతో డాక్టర్ మధుకుమార్, డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 10: రాష్ట్ర స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ టోర్నీలో బుల్లయ్య కళాశాల విద్యార్థులు సాయి లోహిత్, భాగ్యరాజు పతకాలు సాధించారు. తిరుపతిలో జరిగిన ఈ టోర్నీ 54 కిలోల విభాగంలో సాయి లోహిత్ స్వర్ణం కైవసం చేసుకోగా, 87 కిలోల కేటగిరిలో భాగ్యరాజు కాంస్య పతకం సాధించారు. మంగళవారం కళాశాల కార్యదర్శి డాక్టర్ మధుకుమార్,వ్యాయామ విద్య విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, డైరెక్టర్లు డాక్టర్ బీఆర్ఎస్ లక్ష్మణరెడ్డి, అసిస్టెంట్ డీన్ మేజర్ బ్రహ్మానందరెడ్డి అభినందించారు.

మత్స్యజాతుల సంరక్షణపై అవగాహన



వేదికపై ఆసీనులైన ప్రముఖులు

మహారాణిపేట, సెప్టెంబరు 10: సముద్రంలో అరుదైన మత్స్య జాతుల సంరక్షణపై కేంద్ర సముద్ర ఉత్పత్తుల పరిశోధన సంస్థ మత్స్యకారులకు అవగాహన కల్పించింది. మంగళవారం ఫిషింగ్ హార్బర్‌లోని బోట్ ఆపరేటర్ల సంఘ కార్యాలయంలో సదస్సు నిర్వహించారు. ఐసీఏఆర్ సీఎమ్ఎఫ్ఆర్ఐ ప్రిన్సిపల్ డాక్టర్ జాయ్ కే కూర్ఘూ కుదాన్, డాక్టర్ పి.రంజన్ బెహరాలు సముద్ర జాతుల సంరక్షణ, అరుదైన మత్స్య సంపద అంతరించిపోకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సముద్ర తాబేళ్లు, డాల్ఫిన్ల సంరక్షణకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. ఈ సమావేశంలో అధ్యక్షుడు లక్ష్మణరావు, నరసింగరావు, పరశురామ్, ఎల్లారావు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అత్యున్నత స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

కేంద్ర క్రీడల ప్రచార కమిటీ కార్యదర్శి ప్రసాద్ మహంకర్



కేంద్ర క్రీడల ప్రచార కమిటీ కార్యదర్శి ప్రసాద్ మహంకర్‌ను సన్మానించి జ్ఞాపిక అందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 10: క్రీడా భారతి నుంచి అనేక మంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదిగారని కేంద్ర క్రీడల ప్రచార కమిటీ కార్యదర్శి ప్రసాద్ మహంకర్ పేర్కొన్నారు. విశాఖలో పర్యటించిన ఆయన స్థానిక క్రీడా భారతి ప్రతినిధులు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, శిక్షకులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. క్రీడా భారతిని సామాజిక సేవా సంస్థగా అభివర్ధించారు. విద్యార్థులను ఉన్నత స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నగదు బహుమతులను అందించాలని జాతీయ క్రీడా భారతి నిర్ణయించిందని తెలిపారు. ఇకపై జాతీయ స్థాయి టోర్నీల్లో ప్రథమ స్థానానికి రూ.లక్ష, ద్వితీయ స్థానానికి రూ.50 వేలు, తృతీయ స్థానానికి రూ.30 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు. నిపుణులైన శిక్షకుల కోసం స్థానిక క్రీడాభారతి ప్రతినిధులు కృషి చేయాలన్నారు. ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, మాజీ ఒలింపియన్ ఎంవీ. మాణిక్యాలు, రైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడల అభివృద్ధికి సహకరించండి

ప్రసాద్ మహంకర్, ఎమ్మెల్యే గణబాబు మంగళవారం పలు అంశాలపై చర్చించారు. గ్రామీణ క్రీడల అభివృద్ధి, ప్రతిభ గల వర్ధమాన ఔత్సాహిక క్రీడాకారులకు అందించే ప్రోత్సాహం వంటి అంశాలపై ఎమ్మెల్యే నుంచి పలు సలహాలు, సూచనలు తీసుకున్నారు. సంక్రాంతి రోజుల్లో 16 ఏళ్లలోపు బాల బాలికలకు వాలీబాల్, అథ్లెటిక్స్, చదరంగం తదితర క్రీడాంశాల్లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. డిసెంబరు 9న జరగనున్న జాతీయ స్థాయి స్పోర్ట్సు క్విజ్ పోటీల్లో ఎక్కువ మంది బాల బాలికలు ప్రాతినిధ్యం వహించేలా చొరవ చూపాలన్నారు. ఇందుకు గణబాబు సానుకూలంగా స్పందించారు.

'సవాళ్లను అధిగమిస్తూ బాబు పాలన'



సమావేశంలో మాట్లాడుతున్న గండి బాబ్జీ

మహారాణిపేట, సెప్టెంబరు 10: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత సవాళ్లు ఎదురైనా వాటిని అధిగమించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలన సాగిస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ అన్నారు. మంగళవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే కృష్ణా నదికి వరదలు వచ్చాయని జగన్ అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు ఏడుపదుల వయస్సులో విజయవాడలోని వరద ప్రాంతాల్లో పర్యటిస్తూ సహాయక చర్యలు పర్యవేక్షించారని, అదే జగన్ అయితే ఏరియల్ సర్వే చేసి మమ అనిపించేవారన్నారు. జగన్ వరద బాధితులకు కోటి రూపాయలు ఇచ్చి చేతులు దులుపుకొన్నారని ఆక్షేపించారు. చంద్రబాబును అక్రమంగా జగన్ జైలుకు పంపి ఏడాది అయ్యిందని, అతడి పోకడ చూసి రాష్ట్ర ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారని అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను చూసి జగన్ బుద్ధి తెచ్చుకోవాలన్నారు. ఉత్తరాంధ్రలో సమస్యలు పరిష్కరిస్తామని, చంద్రబాబు సారథ్యంలోనే రాష్ట్రం పురోభివృద్ధి సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజలు సహకరించాలని కోరారు. సమావేశంలో టీడీపీ అధికార ప్రతినిధి గొంప కృష్ణ, ఉరుకటి నారాయణరావు, విల్లూరి చక్రవర్తి, ఈతలపాక సుజాత, టి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితి ఉత్సవాల్లో ఎంపీ, ఎమ్మెల్యే



సీతమ్మధారలో వినాయక వేడుకల్లో పాల్గొన్న ఎంపీ శ్రీభరత్, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తదితరులు



ఆక్సిజన్ టవర్స్‌లో రూ.4.5 లక్షలకు వేలం పాడుకున్న గణపతి లడ్డూ ప్రసాదం



30వ వార్డు సాలిపేటలో కొలువుదీరిన నిలువెత్తు వినాయకుడు

సీతంపేట, సెప్టెంబరు 10: సీతంపేట దుర్గాగణపతి ఆలయంలో నాలుగో రోజు స్కంద గణపతి అవతారంలో అలంకరించారు. సుబ్రహ్మణ్య స్వామిని తన తొడపై కూర్చోబెట్టుకొని దుర్గాగణపతి భక్తులకు దర్శనమిచ్చారు. సత్యహరిశ్చంద్ర నాటికను ప్రదర్శించారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవరసిద్ధి వినాయక చవితి పూజా మహోత్సవాల్లో ఎంపీ శ్రీభరత్, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, అరుకు పార్లమెంటరీ ఇంచార్జ్ పరశురామరాజు, టీడీపీ జిల్లా ప్రెసిడెంట్ గండి బాబ్జీ, వెల్లంగి భరత్, సురేష్‌బాబు, రాకేష్ పాల్గొన్నారు. ఆక్సిజన్ టవర్స్‌లో గణనాథుని 50 కేజీల లడ్డూ ప్రసాదాన్ని హర్ష, పల్లవి దంపతులు రూ.4.5 లక్షలకు వేలంలో పాడుకున్నారు. హెచ్‌బీ కాలనీ భానునగర్‌లోని వి.కె. రెసిడెన్సీలో వేద పండితుడు కమాలకరశాస్త్రి ఆధ్వర్యంలో లక్ష్మీ గణపతి యాగం జరిపారు. ఇక్కడి మహిళలు కోలాట నృత్యం చేశారు.

జగదాంబ కూడలి: టర్నర్ చౌల్ట్రీ దరి గ్రేటర్ 30వ వార్డు సాలిపేట ప్రాంతంలో యంగ్ రాక్ స్టార్స్ ఏర్పాటు చేసిన నిలువెత్తు వినాయకుడి విగ్రహాన్ని తిలకించేందుకు వన్‌టౌన్ ప్రాంత ప్రజలు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. వరసిద్ధి వినాయక వర్తక సంఘం ఏర్పాటు చేసిన గణపతికి ప్రత్యేకత ఉంది. ఇక్కడ హుండీ లేకుండా నిర్వాహకులు జాగ్రత్త తీసుకున్నారు. సొంత నిధులతో అయిదారేళ్లుగా మెయిన్ రోడ్డు వద్ద ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు వర్తక సంఘం కార్యదర్శి గంగాడ గోవింద్ వెల్లడించారు.





కార్యక్రమంలో జ్యోతిని వెలిగిస్తున్న నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వీసీ బాలమోహన్‌దాస్ తదితరులు, హాజరైన వృద్ధులు

వృద్ధులకు విశ్రాంతి భవనం నిర్మించాలి

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 10 : నగరంలో సుమారు మూడు లక్షల మంది వయో వృద్ధులు ఉన్నారని వీరికి వినోదం, కాలక్షేపం, విశ్రాంతి కోసం ఒక విశాలమైన భవనం అవసరమని నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్ డిమాండ్ చేశారు. మంగళవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో విశాఖ జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ రోశయ్య ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఇచ్చిన ఆదేశాల్లో భాగంగా బీచ్‌రోడ్డులో 1560 గజాల స్థలంలో భవన నిర్మాణానికి శంకుస్థాపన జరిగిందని, ఇప్పుడు ఆ ప్రాంతం దుర్భరంగా ఉందన్నారు. వుడా ఉన్నతాధికారులు ఎవరూ స్పందించలేదన్నారు. కార్యక్రమానికి సంఘం అధ్యక్షుడు కె.మంగపతి అధ్యక్షత వహించి మాట్లాడుతూ నగరంలోని వయోవృద్ధులంతా సంఘటితమై కృషి చేయాలన్నారు. సంఘం కార్యదర్శి డా.పి.కె.జోష్, మెజీషియన్ కె.రవిశంకర్, డా.జ్యోత్స్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ వద్దు'



గురుద్వార కూడలిలో నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు, డ్రైవర్లు

సీతంపేట, సెప్టెంబరు 10: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ వెంటనే రద్దు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. గురుద్వార కూడలిలోని ఆటో స్టాండ్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. వామనమూర్తి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక విశాఖ ఉక్కు పరిశ్రమ, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించి దేశ సంపదను కొల్లగొడుతున్నారని మండిపడ్డారు. ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని, దీనికి అవసరమైన బొగ్గు, ఇసుక, ఉక్కు గుండు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సంస్థలను ప్రైవేటీకరించే చర్యలు వెంటనే ఆపకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రావికృష్ణ, ఎస్.పాపారావు, ఎస్.సూరిబాబు, ఎ.నర్సింగ్ మూర్తి, పి.బుజ్జి, రవి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాతనగరంలో నీటికోసం అవస్థలు

జగదాంబ కూడలి, సెప్టెంబరు 10: ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలకు రిజర్వాయర్లు నిండుకుండలా మారినా జీవీఎంసీ అరకొరగా నీటిని సరఫరా చేయడంతో పాతనగరం ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతోంది. సోమవారం కుళాయి ద్వారా మంచి నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు అనేక అవస్థలు పడ్డారు. పాత నగరంలోని జగదాంబ జంక్షన్ 30వ వార్డు నుంచి గ్రేటర్ 39వ వార్డు పాత పోస్టాఫీసు వరకు ప్రజలకు కుళాయి నీరే ఆధారం. ఒక్కరోజు సరఫరాకు ఇబ్బంది ఎదురైనా ప్రజల కనీస అవసరాలు తీర్చుకోవడం కష్టమే. ఇలాంటి సందర్భాల్లో జీవీఎంసీ అధికారులు ట్యాంకర్లను పంపిస్తుంటారు. శని, ఆదివారాల్లో కురిసిన ఎడతెరిపిలేని వానల ప్రభావంతో సోమవారం నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయి ఇబ్బందులు ఎదురయ్యాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం కూడా అరకొరగా నీరు ఇవ్వడంతో కుళాయి వద్ద నీటి కోసం ఎదురుచూసిన మహిళలు అసంతృప్తి వ్యక్తం చేశారు. పాతనగరం వాసులకు నీటికష్టాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. బుధవారం నుంచి ఇబ్బందులు లేకుండా చూస్తామని సంబంధిత వర్గాలు తెలిపాయి.

భయపెడుతున్న శునకాలు

మురళీనగర్, సెప్టెంబరు 10 ; విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని మాధవధార ఉడాకాలనీ, 49వ వార్డు బర్మాక్యాంపు ప్రాంతాల్లో వీధికుక్కల ఆగడాలతో స్థానికులు సతమతమవుతున్నారు. ఇళ్ల చుట్టూ పగలు రాత్రి తిరుగాడే కుక్కలు పిల్లలను గాయపరుస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో రాకపోకలు సాగించే వారికి మరింత ఇబ్బందిగా మారిన వీధి కుక్కలను నియంత్రించాలని ఈ ప్రాంతాల వారు కోరుతున్నారు. మాధవధార ఉడాకాలనీలో బైక్స్, కార్ల వెంట పరుగులు పెడుతున్న కుక్కలు వాహనదారులను ప్రమాదాలకు గురిచేస్తున్నాయి.

సీఐల బదిలీ

విశాఖపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ సీపీ శంఖబ్రతబాగ్చి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. వీఆర్‌లో ఉన్న కొందరికి పోస్టింగ్ ఇచ్చారు. ఆనందపురం సీఐగా పనిచేస్తున్న టీవీ తిరుపతిరావును రేంజ్ వీఆర్‌కు సరండర్ చేశారు. ఆ స్థానంలో ఏఎస్ఆర్ జిల్లా ఎన్‌డీపీఎస్ టాస్క్ ఫోర్స్ సీఐగా పనిచేస్తున్న సీహెచ్ వాసునాయుడికి పోస్టింగ్ ఇచ్చారు. గాజువాక సీఐగా పనిచేస్తున్న మరడాన శ్రీనివాసరావును రేంజ్ వీఆర్‌కు సరండర్ చేశారు. ఆయన స్థానంలో త్రీటౌన్ సీఐగా పనిచేస్తున్న ఎ.పార్థసారధిని నియమించారు. అనకాపల్లి జిల్లా వీఆర్‌లో ఉన్న పల్లా రమణయ్యకు త్రీటౌన్ సీఐగా పోస్టింగ్ ఇచ్చారు. స్పెషల్‌బ్రాంచి (పొలిటికల్) సీఐగా పనిచేస్తున్న వానపల్లి రామారావును కంచరపాలెం సీఐగా, సిటీ వీఆర్‌లో ఉన్న వాసంశెట్టి శ్రీనివాసరావును ఆరిలోవ సీఐగా నియమించారు.

ముగ్గురు ఎస్‌ఐలకు స్థానచలనం

పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న ముగ్గురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ సీపీ శంఖబ్రతబాగ్చి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. వీఆర్‌లో ఉన్న ఐ.నాగరాజుకు గాజువాక ట్రాఫిక్ ఎస్ఐగా పోస్టింగ్ ఇచ్చారు. పీఎం పాలెం క్రైమ్ ఎస్ఐగా పనిచేస్తున్న గొండేల ప్రసాద్‌ను పీఎం పాలెం ట్రాఫిక్ ఎస్ఐగా బదిలీ చేశారు. పోర్ట్ ఇమ్మిగ్రేషన్ ఎస్ఐగా, పోలీస్ పీఆర్‌ఓగా పనిచేస్తున్న ఎస్.కృష్ణవర్మను దువ్వాడ ట్రాఫిక్ ఎస్ఐగా బదిలీ చేశారు.

అప్రమత్తంగా ఉండండి

... 5వ పేజీ తరువాయి

ఎనిమిది తేదీల్లో కురిసిన భారీవర్షాల వల్ల జిల్లాలో కొంత మేర నష్టం వాటిల్లినట్టు తెలిపారు. ఎక్కడికక్కడ సహాయ చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జాయింట్ పోలీస్ కమిషనర్ డాక్టర్ కె.ఫకీరప్ప, విశాఖపట్నం జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్‌డీవోలు హుస్సేన్ సాహెబ్, పి.భాస్కర్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారులు, జీవీఎంసీ, పౌర సరఫరా, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

89 చోరీ కేసుల్లో 80 మంది అరెస్టు

... 5వ పేజీ తరువాయి

బంగారం, నగదు, ద్విచక్ర వాహనాలు, ఆటోలతోపాటు 255 సెల్‌ఫోన్‌లు రికవరీ చేశారన్నారు. ప్రతి నెలా కేసుల ఛేదనతోపాటు రికవరీ పెంచాలన్న లక్ష్యానికి అనుగుణంగా క్రైమ్ డీసీపీ లతామాధురి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారని అభినందించారు. వారందరికీ త్వరలో రివార్డులు అందజేయనున్నట్టు ప్రకటించారు. అనంతరం రికవరీ చేసిన సొత్తును బాధితులకు సీపీ చేతుల మీదుగా అందజేశారు. ఈ సమావేశంలో జాయింట్ సీపీ ఫకీరప్ప, క్రైమ్ డీసీపీ కె.లతా మాధురి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీలేరు, భద్రాచలం బస్సులు రద్దు

... 5వ పేజీ తరువాయి

నేపథ్యంలో మొత్తం గండ్లు, గోతులు పూడ్చిన తరువాత ట్రయల్ రన్ వేసిన తరువాత ప్రయాణికులకు సేవలు అందిస్తామని అధికారులు వెల్లడించారు. ఆర్ అండ్ బి అధికారులకు ఇప్పటికే సమాచారం ఇచ్చినట్టు అధికారులు తెలిపారు.

నేటి నుంచి అరకు బస్సుల పునరుద్ధరణ

భారీవర్షాలు, వరదలు కారణంగా విశాఖ నుంచి అరకులోయ రాకపోకలు సాగించే మూడు బస్సులను గత శనివారం నుంచి నాలుగు రోజుల పాటు రద్దు చేశారు. ప్రస్తుతం పరిస్థితులు అనుకూలించడంతో బుధవారం నుంచి ఈ సర్వీసులను పునరుద్ధరించనున్నట్టు రీజియన్ అధికారులు ప్రకటించారు. విశాఖపట్నం నుంచి మాడుగుల, పాడేరు వెళ్లాల్సిన సర్వీసులను చోడవరం వరకు మాత్రమే నడుపుతు న్నారు. భారీ వర్షాల కారణంగా చోడవరం నుంచి మాడుగుల, పాడేరు రూట్‌లు బాగా పాడయ్యాయి. ప్రయాణికులతో ఈ రూట్లలో బస్సులు నడపడం అంత క్షేమం కాదని బస్సులు చోడవరం వరకే నడిపేందుకు నిర్ణయించారు.

రోడ్డెక్కిన ఉక్కు కార్మికులు

... 5వ పేజీ తరువాయి

అణచివేయడం తగదన్నారు. ఉక్కు కార్మికులను నిర్బంధించాలని చూస్తున్న ప్రభుత్వాలకు బుద్ధి వచ్చేలా చేస్తామన్నారు. పోలీసులు మద్దతు ఇస్తామని చెప్పి కార్మికులకు వెన్నుపోటు పొడుస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించే చర్యలను నిలుపు చేయాలని కోరారు. జె.అయోధ్యరామ్, పరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయించకుండా ప్రభుత్వం చోద్యం చూడడం అన్యాయమన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం తక్షణమే వెనక్కి తీసుకోకపోతే, తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ మాట్లాడుతూ ఉక్కు కర్మాగారానికి సొంత గనులను కేటాయించాలన్నారు. ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవలసిన బాధ్యత రాష్ట్రంలో ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, నిర్వాసిత నాయకులు ఎన్.గంగారామ్, పులి వెంకటరమణారెడ్డి, కేఎస్ఎన్ రావు, ఎన్.రామారావు, నీరుకొండ రామచంద్రరావు, జెర్రిపోతుల ముత్యాలు, బొడ్డు పైడిరాజు, విళ్ల రామ్మోహన్‌కుమార్, దొమ్మేటి అప్పారావు, పెంటారావు, శ్రీనివాసులు నాయుడు, ప్రగడ వేణుబాబు, వీవీ రమణ, యు.రామస్వామి, వి.ప్రసాద్, వెంకటేశ్వరరావు, గంగవరం గోపి, మాటూరి రాము, గణపతిరెడ్డి, రమణ, మాటూరి శ్రీనువాస్, గుమ్మడి నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న రహదారులు

... 5వ పేజీ తరువాయి

దారుణంగా తయారైంది. వాహన చోదకులు గోతులను తప్పించే యత్నంలో కొందరు పక్క నుంచి వెళ్లే వాహనాలను ఢీకొంటున్నారు. మరికొందరు భారీ వాహనాల వెనుక వెళుతూ...రోడ్డుపై ఏర్పడిన గోతులను గమనించక అదుపుతప్పి పడిపోతున్నారు. నగరంలోని అంతర్గత రహదారుల పరిస్థితి కూడా అదే మాదిరిగా తయారైంది. శివాజీపాలెంలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ క్యాంపు కార్యాలయం సమీపంలో వర్షం నీరు నిలిచిపోవడంతో రోడ్డు కుంగిపోయింది. రోడ్డు మధ్యలో భారీ గొయ్యి ఏర్పడింది. వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతుండడంతో స్థానికులు కొందరు గొయ్యిపై పాడైపోయిన వెదురు కుర్చీని ఉంచారు. పీఠాపురం కాలనీ ఆంధ్రా బ్యాంకు రోడ్డు కూడా వర్షం నీరు నిలిచిపోవడం కారణంగా కుంగిపోవడంతో గొయ్యి ఏర్పడింది. వాహన చోదకులు ఆ గొయ్యిని గమనించకుండా ప్రమాదాలకు గురవుతున్నారు. మద్దిలపాలెం ఆర్టీసీ డిపో ఎదురుగా జాతీయ రహదారిపై రోడ్డుపై భారీ గొయ్యి ఏర్పడింది. మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్ పక్కన ఉన్న బస్‌బే ఎదురుగా రోడ్డుపై భారీ గొయ్యి ఏర్పడడంతో వాహన చోదకులు గుర్తించేందుకు వీలుగా గోతిలో కర్రలు పెట్టారు.

రూ.12 కోట్లతో మరమ్మతులకు జీవీఎంసీ సన్నద్ధం

గత 15 రోజుల్లో కురిసిన వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లను రూ.12 కోట్లతో మరమ్మతు చేసేందుకు జీవీఎంసీ సన్నద్ధమవుతోంది. వర్షాల వల్ల జీవీఎంసీ పరిధిలో 22 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నట్టు అధికారులు గుర్తించారు. కొన్నిచోట్ల రోడ్లపై భారీగోతులు ఏర్పడినందున వాటిని ప్రత్యేక జాగ్రత్తలతో పూడ్చాల్సి ఉంటుందని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. దెబ్బతిన్న రోడ్లను రిపేరు చేయాలంటే రూ.12 కోట్లు ఖర్చు అవుతుందని అంచనాలు తయారుచేసిన అధికారులు ఉన్నతాధికారుల ఆమోదానికి పంపించారు. కమిషనర్ ప్రస్తుతం విజయవాడలో ఉన్నందున ఆయన రాగానే రోడ్ల మరమ్మతులకు సంబంధించిన పనులను చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులు భావిస్తున్నారు. వీలైనంత త్వరగా రోడ్లను మరమ్మతు చేయకపోతే ప్రమాదాలు పెరగడం ఖాయమని నగరవాసులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఆరోగ్య శాఖపై ఫిర్యాదుల వెల్లువ

... 5వ పేజీ తరువాయి

అధికారులకు ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పలువురికి ఉద్యోగాలు ఇచ్చారంటూ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే క్లాస్-4, జూనియర్ అసిస్టెంట్, ఎఫ్ఎన్‌వో, ఎంఎన్‌వో పోస్టులకు సంబంధించి చేపట్టిన బదిలీలు, పదోన్నతుల్లో భారీగా డబ్బులు చేతులు మారాయని, అస్మదీయులకు మేలు చేశారంటూ ఆరోగ్య శాఖలో ఏవోగా పనిచేసి పదవీ విరమణ చేసిన ఒకరు అప్పట్లో సూపరింటెండెంట్‌గా పనిచేసిన అధికారిపై ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేస్తున్న విజిలెన్స్ అధికారులు తాజాగా ఆయా నియామకాలకు సంబంధించిన వివరాలు ఇవ్వాలంటూ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారికి లేఖ రాశారు. అలాగే, ఆంధ్ర మెడికల్ కాలేజీ పరిధిలో కొన్నాళ్ల కిందట పలు పోస్టులను భర్తీచేశారు. ఆ పోస్టుల భర్తీలో అక్రమాలు జరిగాయని, తనకు రావాల్సిన ఉద్యోగాన్ని ఫేక్ సర్టిఫికెట్లు పెట్టిన వారికి ఇచ్చారంటూ ఒక యువతి జిల్లా కలెక్టర్, డీఎంహెచ్ఓ, ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపై విచారణ చేసిన అధికారులు అడ్డగోలుగా ఉద్యోగాలు పొందిన ఇద్దరిని కొద్దిరోజుల కిందట విధుల నుంచి తొలగించారు. అయితే, ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణకు డీఎంహెచ్ఓ ఆదేశించినట్టు తెలిసింది.

బీచ్‌రోడ్డులో రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు

» భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం, సెప్టెంబరు 10: భీమిలి బీచ్‌రోడ్డులో ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించే కార్యక్రమంలో భాగంగా రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. తీరంలో కోతకు గురవుతున్న ప్రదేశాన్ని మంగళవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. బీచ్‌పార్క్ నుంచి నోవాటెల్ రిసార్టు మీదుగా పోలమాంబ గుడివరకూ కోతకు గురవుతోందని బోయవీధి గ్రామస్థులు కాసరపు దుర్గారావు, కొక్కిరి కాశీడు వివరించారు. తుపాన్ల సమయంలో పలు కుటుంబాలు భయం దోళనతో గడుపుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై ఎమ్మెల్యే గంటా మాట్లాడుతూ, గతంలో తాను మంత్రిగా ఉన్నపుడు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు తయారుచేసినట్టు గుర్తుచేశారు. ఈ ప్రతిపాదనలు తిరిగి పరిశీలించాలని జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, పబ్లిక్ వర్క్స్ ఏఈ ఎ.సుమన్‌లను ఆదేశించారు. పర్యటనలో కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి, టీడీపీ నాయకులు గాడు అప్పలనాయుడు, గంటా నూకరాజు, మారోజు సంజీవ్, కొక్కిరి అప్పన్న, కాసరపు చిన ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.


స్థానికుల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గంటా


బీచ్‌రోడ్డులో కోతకు గురైన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

రైతుబజారును ప్రారంభించండి

తగరపువలస: తగరపువలసలో రూ.78 లక్షలతో నిర్మాణం పూర్తిచేసుకున్న రైతుబజారును తక్షణం ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మార్కెటింగ్‌శాఖ అధికారులను ఆదేశించారు. రైతుబజారుతో పాటు కొండవాలు ప్రాంతాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుబజారులో ఉన్న 36 స్టాళ్లలో 27 రైతులకు కేటాయిస్తామన్నారు. మిగిలినవాటిని స్వయం సహాయక సంఘాలకు, సూపర్‌బజారుకు కేటాయిస్తామన్నారు.సత్యనారాయణ కొండవాలులో కొండచరియలు విరిగిపడుతున్నందున ఈ ప్రాంతంలో నివసిస్తున్న 20 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు చెప్పారు. ఈ ప్రాంతంలోని వారికి తాగునీటిని అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెండో వార్డు కార్పొరేటర్ చిన్నికుమారి లక్ష్మి, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి ఇతర అధికారులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఎస్‌హెచ్‌జీల వితరణ


సీఎం రిలీఫ్ ఫండ్‌కు చెక్కు అందిస్తున్న వెంకటరావు, మహిళా సంఘం సభ్యులు

మధురవాడ, సెప్టెంబరు 10: గ్రేటర్ ఏడో వార్డు స్వయం సహాయక బృందాలు విజయవాడ వరద బాధితులకు ఆర్థిక సహాయం చేశాయి. కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, టీడీపీ నేత పిళ్లా వెంకటరావుల సమక్షంలో రూ.40 వేల చెక్కును మంగళవారం సీఓకు అందించారు. కార్యక్రమంలో ఆర్పీలు పాల్గొన్నారు.

బాధితులకు అల్పాహారం పంపిణీ

ఆరిలోవ: ఇటీవల కురిసిన వర్షాలకు ఆరిలోవ లోతట్టు ప్రాంతంలో చిక్కుకున్న వారికి అన్నక్యాంటీన్ భవనంలో తహసీల్దార్ ఆశ్రయం కల్పించారు. వారికి మంగళవారం స్థానిక జనసేన నేత నీలి పైడిరాజు అల్పాహారం అందించారు.

ఘనంగా కొత్తమ్మతల్లి ఉత్సవాలు


ఉత్సవాల్లో పాల్గొన్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి, మేయర్ హరివెంకట కుమారి

ఎంవీపీకాలనీ, సెప్టెంబరు 10: స్థానిక మూలపాలెంలోని కొత్తమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పాల్గొన్నారు. నగరం అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించినట్లు ఎంపీ తెలిపారు. నీటి కలశాలతో ఊరేగింపుగా వెళ్లి సముద్ర తీరంలో భక్తులు పూజలు చేశారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ, కార్పొరేటరు గొలగాని మంగవేణి పోలారావు పాల్గొన్నారు.

యువతకు విశాఖ చరిత్ర తెలియజేయాలి

» దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

సిరిపురం, సెప్టెంబరు 10: విశాఖ చరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. దశాబ్దాల చరిత్ర కలిగిన వైజాగ్‌పటం క్లబ్ నంబర్‌వన్‌గా ఎదిగేందుకు తన వంతు సహకరిస్తానన్నారు. ఎమ్మెల్యేను వైజాగ్‌పటం క్లబ్ గౌరవాధ్యక్షుడిగా నియమించడంతో క్లబ్ సాయంత్రం సమావేశ మందిరంలో మంగళవారం క్లబ్ అధ్యక్షుడు వంకాయల సన్యాసిరావు, కార్యదర్శి డా.బి.రాజపాత్రుడు, ఉపాధ్యక్షుడు నరవ రాంబాబు సత్కరించారు. అనంతరం విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు వీలుగా సీఎం సహాయనిధికి రూ.లక్షను ఎమ్మెల్యే వంశీకృష్ణ చేతులమీదుగా అందజేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోడి నరసింహాచారి, గ్రంధి విష్ణు, భరత్, వెంకటరెడ్డి, కృష్ణంరాజు, శ్రీనివాసు, తలారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

భూగర్భ జలాల పరిరక్షణ అందరి బాధ్యత

భీమునిపట్నం, సెప్టెంబరు 10: భూగర్భజలాలను పెంపొందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ ఎంవీడీ ఫణిరాం అన్నారు. జోన్1 కార్యాలయ సమావేశ మందిరంలో నీటి వనరుల పునరుజ్జీవంపై పొదుపు సంఘాల ఆర్పీలతో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరువులు, వాగులపై అక్రమ నిర్మాణాలతో అనేక ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి మాట్లాడుతూ నీటివనరుల వృద్ధికి సహకరించాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, యూసీడీ పీవో డి.లక్ష్మి, ఏపీడీ సంతోష్, కార్పొరేటర్లు గాడు చిన్నికుమారిలక్ష్మి, గంటా అప్పలకొండ, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ ఫణిరామ్

'సమస్యకు ఆత్మహత్య పరిష్కారం కాదు'

భీమునిపట్నం, సెప్టెంబరు 10: ఆత్మహత్యలతో జీవితాలను ముగించుకోవడం సరికాదని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ డైట్ వైస్‌ప్రిన్సిపాల్ యు.మాణిక్యంనాయుడు అన్నారు. మంగళవారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా ఏటా 8 లక్షల ఆత్మహత్యలు జరుగుతుండగా, దేశంలో 1.2 లక్షలు నమోదుకావడం విచారకరమన్నారు. మానసిక ఒత్తిడి, సమస్యలతో బాధపడేవారే ఆత్మహత్యకు యత్నిస్తారని, సమస్యలకు అది పరిష్కారం కాదన్నారు. ఆత్మహత్యల నివారణపై మాస్టర్ ట్రైనర్ గొట్టేటి రవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎల్.సుధాకర్, జీజీఎస్ నాగేశ్వరరావు, సోమయాజులు, మహాలక్ష్మి, త్రినాథరావు, నీలిమ, హరిణి, అల్లాఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



డైట్‌లో ఆత్మహత్యల నివారణ దినం నిర్వహిస్తున్న ఛాత్రోపాధ్యాయులు

'అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ'

ఆనందపురం, సెప్టెంబరు 10: ఎయిడ్స్‌ను అవగాహనతో నివారించగలమని లింక్‌వర్కర్స్ స్కీమ్ సీఎల్‌డబ్ల్యూ ఎం.జ్యోతి అన్నారు. బోనిలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ ఆధ్వర్యంలో 'మీకు తెలుసా' పేరిట ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెచ్ఐవీ, సుఖవ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నాకో నేతృత్వంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. హెచ్ఎం ఎస్.కృష్ణారావు, హెచ్‌ఓ జశ్వంత్, ఏఎన్ఎం బాజియా తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ విజేతలకు అభినందన


భీమునిపట్నం (రూరల్), సెప్టెంబరు 10: బాక్సింగ్ పోటీల్లో విజేతలను మంగళవారం చిప్పాడ వద్ద దివీస్ కార్యాలయంలో అధికారులు అభినందించారు. ఈనెల 3, 4 తేదీల్లో న్యూఢిల్లీలో జరిగిన పోటీల్లో వీరు ప్రతిభ చాట అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. వీరిలో 17 మందికి దివీస్ ఆర్థిక సాయం అందించింది. కోచ్ ఆదినారాయణ నేపాల్ వెళ్లడానికి కూడా సాయం అందించారు. దివీస్ డైరెక్టర్లు డా.దేవేంద్రరావు, ఎల్‌వీ రమణ, జీఎం వైఎస్ కోటేశ్వరరావు విజేతలను అభినందించి జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో సామాజిక సేవా విభాగం అధికారి డి.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బాక్సింగ్ విజేతలతో దివీస్ అధికారులు

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం

సింహాచలం, సెప్టెంబరు 10: వరాహలక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత నిత్యకల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి, భక్తుల గోత్రనామాలతో సంకల్పించి షోడశోపచారాలు సమర్పించారు. కంకణధారణ, యజ్ఞోపవీత సమర్పణలు, జీలకర్రా బెల్లం, మాంగళ్య సమర్పణలు చేసి అక్షితారోపణ జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం: వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో నిత్యాన్న ప్రసాద పథకానికి నగరానికి చెందిన సాయిదిలీప్ శర్మ, డా.ప్రియాంక దంపతులు రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం నగదు రూపంలో మంగళవారం ఈవో సింగాల శ్రీనివాసమూర్తికి అందజేశారు. ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు స్వామివారి దర్శనం కల్పించి, శేషవస్త్రంతో సత్కరించి, వేదాశీర్వచనాలిచ్చారు. ఈఓ అన్నప్రసాద బాండ్‌ను, ప్రసాదాలను అందజేశారు.

'పంట నష్టం అంచనా వేయండి'

పద్మనాభం (రూరల్), సెప్టెంబరు 10: వర్షాలకు గ్రామాల్లో జరిగిన నష్టాలను అంచనావేయాలని ఎంపీపీ కె.రాంబాబు అధికారులను ఆదేశించారు. మండలపరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. భారీ వర్షాలకు పంట నష్టం, దెబ్బతిన్న ఇళ్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు అందించాలన్నారు. గ్రామాల్లో తక్షణమే పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా క్లోరినేషన్ చేయించాలన్నారు. సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ సుంకరి గిరిబాబు, ఎంపీడీవో ఎం.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కూరగాయల పంటలకు నష్టం

పద్మనాభం(రూరల్), సెప్టెంబరు 10: భారీ వర్షాలకు మండలంలోని కూరగాయల పంటలకు అపారనష్టం వాటిల్లింది. అనంతవరం, పెంట, కొవ్వాడ, కోరాడ, నరసాపురం, సుంకరపేట, భద్రయ్యపేట తదితర గ్రామాల్లో రైతులు కూరగాయలను సాగు చేస్తున్నారు. వర్షాలకు నీరు నిలిచిపోవడంతో పంట నాశనమైందని రైతులు వాపోయారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు.

పాండ్రంగి కాజ్‌వేపై రాకపోకలు బంద్

పద్మనాభం(రూరల్), సెప్టెంబరు 10: మండలంలోని పాండ్రంగి కాజ్‌వేపై పూర్తిగా నీటి ప్రవాహం తగ్గేవరకు రాకపోకలు సాగించవద్దని తహసీల్దార్ ఎ.ఆనంద్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం కాజ్‌వేను పరిశీలించారు. నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో రాకపోకలు సాగిస్తున్నవారిని ఆపారు. కాజ్‌వేపైకి ఎవరూ వెళ్లకుండా సిబ్బందిని కాపలా ఉంచారు.

అప్పన్న ఆలయ అర్చకుడు రవికుమార్ మృతి



సింహాచలం, సెప్టెంబరు 10: వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో అర్చకుడిగా పనిచేస్తున్న ఆత్మకూరి రవికుమార్ మంగళవారం మృతి చెందారు. 21ఏళ్లుగా ముఖ్య అర్చకునిగా పనిచేస్తున్నారు. రెండు రోజులుగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న ఆయన సోమవారం రాత్రి చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి, డీవీఎస్ రామరాజు(హరి), అప్పన్న ఆలయ ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కార్పొరేటర్ పీవీ నరసింహం తదితరులు మృతదేహానికి నివాళులర్పించారు.

పీఎం సూర్య ఘర్‌పై అవగాహన


పీఎం సూర్య ఘర్ పోస్టర్ ప్రదర్శిస్తున్న దృశ్యం

భీమునిపట్నం, సెప్టెంబరు 10: ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు మంగళవారం అవగాహన కల్పించారు. వాసవి కళ్యాణమండపంలో సోలార్ ప్యానల్స్ వినియోగంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ సూర్యఘర్ యోజన పథకంలో అతితక్కువ ధరకు సోలార్ ప్యానల్స్‌తో విద్యుత్‌ను పొందే విధానాన్ని వివరించారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు, రాయితీలను వివరించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, పూసర్ల శ్రీనివాసరావు, కంచర్ల కామేష్, ఏఈఈలు యు.సకరయ్య, బొట్ట రవి, వై.రవికుమార్ పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శ్రీకృష్ణజన్మాష్టమి ఊరేగింపు విశిష్టతను వివరించారు. విజయరాంపురం కమిటీ అధ్యక్షుడు త్రినాధరావు, కృష్ణసూరప్పడు, సురేష్, శ్రీనివాసరావు, రాజు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్:** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీకన్య, కిన్నెర, శారద, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీకాంత్ (గాజువాక).
- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1,2 (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **మారుతీనగర్ సుబ్రహ్మణ్యం :** నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), హెవెన్-3 (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **కమిటీ కుర్రోళ్ళు :** శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **తంగలాన్ :** నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 48, టమాటా 30, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 48, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 30, బీరకాయలు 42, ఆనపకాయలు 30, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 24, క్యారెట్ 30, దొండకాయలు 44, బంగాలదుంపలు 29, అరటికాయ (పె) 8, మునక్కాడలు (కిలో) 45, అల్లం (పాతది) 130, బరబాటి 42, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 105, గోరుచిక్కుడు 34, దోస కాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 105, పొటల్స్ 44, కీరదోస 32, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 54, కంద 54, దేముడు చిక్కుడు 70, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర(కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 26, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	89
ఫారం ధర	--	109
విత్ స్కిన్	--	188
స్కిన్‌లెస్	--	198

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 1లో..

నేతాజీనగర్‌లో దీపారాధన


దీపాలతో వినాయక రూపాన్ని తీర్చిదిద్దిన భక్తులు

విశాఖపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మద్దిలపాలెం కళాభారతి సమీప నేతాజీనగర్‌లో ఎన్‌వై బాయ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దీపారాధన నిర్వహించారు. స్థానిక మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని దీపాలతో వినాయక రూపాన్ని తీర్చిదిద్దారు. ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కే బాషా, రాజు, పండు, వేణు, మనోజ్, కాజా తదితరుల ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.

గోస్తనీ కాలువపై కాజ్‌వే నిర్మాణం

భీమునిపట్నం (రూరల్), సెప్టెంబరు 10: మండలంలోని మూలకుద్దు వద్ద గల గోస్తనీ నదిపై కాజ్‌వే నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నదిలో నీటిమట్టం పెరిగి గ్రామంలోకి నీరు ప్రవేశించింది. గతంలో నిర్మించిన కాజ్‌వే పూడుకుపోవడంతో రాకపోకలకు ఆటంకం కలిగింది. ఈ నేపథ్యంలో తహసీల్దారు రామారావు పరిస్థితిని సమీక్షించారు. కల్వర్టును లోతు చేసి, అనుబంధ కల్వర్టు నిర్మించాలన్నారు. సముద్ర నీటితో భూగర్భజలాలు ఉప్పగా మారుతున్నాయని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. నగరపాలెంలో రక్షణ గోడలను నిర్మించాలని స్థానికులు కోరారు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణల తొలగింపు

సాగర్‌నగర్, సెప్టెంబరు 10: తిమ్మాపురం బీచ్‌రోడ్డులో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. మధురవాడ సర్వే నంబరు 346/2లో మూడు ఎకరాలను కొంత మంది ఆక్రమించారు. సమాచారం మేరకు ఆర్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఎక్స్‌కవేటర్ సాయంతో ఆక్రమణలను తొలగించి స్థలాన్ని స్వాధీనం చేసుకుని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.